మంగళవారం
25-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 34
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

30న పీఎస్ఎల్వీ సీ56 ప్రయోగం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమవుతున్నది. ఈ నెల 30న పీఎస్ఎల్వీ సీ56 ప్రయోగం చేపట్టనుంది. సింగపూర్‌కి చెందిన డీఎస్-ఎస్ఏఆర్ ఉపగ్రహంతోపాటు మరో ఆరు శాటిలైట్లను నింగిలోకి పంపనున్నది.

2లో

వైసీపీలో
ఆధిపత్య పోరు

- ఎన్నికల వేళ జగన్‌కు తలనొప్పి
- రామచంద్రాపురంపై రచ్చ
- ఎంపీ బోస్ వర్సెస్ మంత్రి వేణు
- గన్నవరం గరం గరం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో ఎన్నికలు జరగనున్న వేళ వైసీపీలో ముఠా తగాదాలు ఒక్కొక్కటీ బయటపడుతున్నాయి. జిల్లాలు, నియోజకవర్గాల్లో ఆధిపత్యం కోసం నాయకులు తహతహలాడుతున్నారు. బలప్రదర్శనను నిరూపించుకోవడం ద్వారా టికెట్లు పొందడానికి ప్రయత్నిస్తున్నారు. కొన్ని నియోజకర్గాలు, జిల్లాల్లో అధిష్ఠానం మాట వినేపరిస్థితి కూడా కనిపించడం లేదు. ఇదంతా ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. అనంతపురము జిల్లా హిందూపురం నియోజకవర్గ వైసీపీ నేతల మధ్య వైరుధ్యాలను సీఎం జగన్ ఇటీవలే పరిష్కరించారు. అక్కడ అంతా చక్కబడిందనేలోగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం నియోజకవర్గ వైసీపీ నేతల ఆధిపత్య పోరు జగన్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం వరకు ఈ పంచాయతీ వెళ్లినా సద్దుమణగలేదు. ఎంతకైనా తెగించేందుకు రెండు వర్గాలు సిద్ధమయ్యాయి. సీఎం సర్దిచెప్పాక కూడా ఆత్మీయ సమావేశాల పేరిట బలప్రదర్శనలు చేయడం వైసీపీ అధిష్ఠానానికి ఇబ్బందిగా మారింది. రామచంద్రాపురం నియోజకవర్గంలో వైసీపీ నేతల మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరు అంతిమ దశకు చేరింది. సిట్టింగ్ ఎమ్మెల్యే, రాష్ట్ర సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, అదే నియోజకవర్గానికి చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మధ్య టికెట్ వార్ నడుస్తోంది. 2024లో వేణుగోపాలకృష్ణకు టికెట్ ఇస్తే తాను అంగీకరించబోనని, అవసరమైతే పార్టీ వీడతానని పిల్లి సుభాశ్ చంద్రబోస్ చేసిన వ్యాఖ్యలతో వైసీపీ అధిష్ఠానం అప్రమత్తమైంది. పార్టీ ఆవిర్భావానికి ముందు నుంచి జగన్‌తో ఎంపీ కలిసి నడిచారు. అప్పట్లో మంత్రి పదవికి రాజీనామా చేసి జగన్ చెంతకు చేరారు. గత ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ బోస్‌కు తన కేబినెట్‌లో మంత్రి పదవి ఇచ్చి జగన్ గౌరవించారు. ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. అనంతరం రాజధాని అంశంపై శాసనమండలిని రద్దు చేస్తూ జగన్ తీర్మానించడంతో బోస్ ఎమ్మెల్సీ పదవి రద్దవుతుందనే ఉద్దేశంతో ఆయనను తిరిగి రాజ్యసభకు జగన్ పంపారు. ఇంత చేసినా బోస్ అధిష్ఠానంపై తిరుగుబాటు చేయడం జగన్‌కు, పార్టీ సీనియర్లకు మింగుడు పడటం లేదు. అటు వేణుగోపాలకృష్ణ సైతం 2014లో కాకినాడ రూరల్ నుంచి వైసీపీ తరపున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. 2019లో కాకినాడ రూరల్ టికెట్‌ను కురసాల కన్నబాబుకు కేటాయించిన వైసీపీ...వేణుగోపాలకృష్ణను రామచంద్రాపురానికి పంపింది. అక్కడ ఆయన గెలవడంతో రెండో విడత మంత్రి పదవి లభించింది. తనను జగన్ రామచంద్రాపురానికి పంపారని, జగన్ మాట ఇస్తే తప్పబోరని మంత్రి వేణు నొక్కిచెబుతున్నారు. దీంతో రాబోయే

- మిగతా 2 లో

మణిపూర్ మంటలు

- పార్లమెంటులో మోదీ ప్రకటన చేయాల్సిందే
- గాంధీ విగ్రహం వద్ద ధర్నాలో ప్రతిపక్షాల డిమాండ్
- చర్చకు భయమెందుకని ఖర్గే ప్రశ్న

న్యూఢిల్లీ: మణిపూర్ ఘోరాలపై మంటలు కొనసాగుతున్నాయి. మణిపూర్ హింసపై ప్రధాని నరేంద్రమోదీ పార్లమెంటులో ప్రకటన చేయాల్సిందేనని విపక్ష పార్టీలు తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించాయి. మోదీ ప్రకటన చేయకపోతే వెనక్కి తగ్గేది లేదని, యావత్ దేశం సిగ్గుపడే ఘటనలు మణిపూర్‌లో చోటుచేసుకుంటున్నాయని, రోజుకో అకృత్యం, అరాచకం బయటికి వస్తున్నదని, అయినా ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని విపక్షాలు విమర్శించాయి. మోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులు సోమవారం పార్లమెంటు కాంప్లెక్స్‌లో ఆందోళనకు దిగారు. 'మణిపూర్ కోసం ఇండియా', మణిపూర్‌పై ప్రధాని ప్రకటన చేయాలి' అన్న ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ధర్నాకు దిగిన ప్రతిపక్షాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా

- మిగతా 2 లో

మాటలయుద్ధం

- విపక్ష, అధికార సభ్యుల పరస్పర విమర్శలు
- స్తంభించిన పార్లమెంటు కార్యకలాపాలు
- ఇతర రాష్ట్రాలపై మౌనమెందుకని బీజేపీ ఎదురుదాడి

న్యూఢిల్లీ: మణిపూర్ అంశంపై సోమవారం పార్లమెంటు స్తంభించింది. దీనిపై ప్రధాని మోదీ పార్లమెంటులో ప్రకటన చేయాల్సిందేనన్న డిమాండ్‌కు ప్రతిపక్షాలు కట్టుబడి ఉంటడంతో ఉభయసభల్లో ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. మోదీ పార్లమెంటు బయట మాట్లాడటమే కానీ లోపల ఎందుకు ప్రకటన చేయడం లేదని ప్రశ్నించాయి. దీనికి అధికార పక్షం ఎదురుదాడికి దిగింది. సభా కార్యకలాపాలు అడ్డుకోవడం ద్వారా చర్చ నుంచి విపక్షాలు పారిపోతున్నాయని ఆరోపించింది. పార్లమెంటు స్తంభించిన సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రధాని మోదీని ఆయన కార్యాలయంలో కలిశారు. పార్టీ సంస్థాగత వ్యవహారాలపై వారు చర్చించినట్లు ఆ పార్టీ వర్గాలు చెప్పుకొచ్చాయి. మరోవైపు, కాంగ్రెస్

- మిగతా 2 లో

అదానీకి భూములు కట్టబెట్టడానికే...
మణిపూర్ హింసపై నారాయణ

3లో

రైతు రుణ మాఫీ చేయాలి

- స్వామినాథన్ సిఫార్సుల అమలుకు చర్యలు
- సాగు సాయంగా రూ.10వేలు అందించాలి
- రైతుసంఘం ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్త ధర్నాలు
- ప్రభుత్వ వైఫల్యాల వల్లే వ్యవసాయ సంక్షోభం: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా రైతులు అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట సోమవారం ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున సాగు చేస్తున్న రైతులకు ఎకరానికి రూ.10,000 సాగుసాయం అందించాలని, డా॥ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర ఇచ్చి...దానికి చట్టబద్ధత కల్పించాలని, పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులను దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఉపకరణాలను 90 శాతం సబ్సిడీతో అందించాలని, వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించాలనే ఆలోచనను ఉపసంహరించుకొని ఉచిత విద్యుత్ కొనసాగించాలని, అన్ని పంటలకు పంటల బీమా వర్తింపచేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, పెరుగుతున్న పంటల ఖర్చులకనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రుణాలివ్వాలని, రైతు, కౌలు రైతుల అన్ని రకాల పంట రుణాలను రెండులక్షల రూపాయల వరకు మాఫీ చేయాలని, కేరళ తరహా రుణ ఉపశమన చట్టం తీసుకురావాలని, 50 ఏళ్ల పైబడిన రైతు, కౌలు రైతులకు నెలకు 10 వేల రూపాయలు పింఛను అందించాలని రైతులు నినదించారు. అనంతపురం కలెక్టరేట్ ముందు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిరుతల మల్లికార్జున అధ్యక్షతన జరిగిన ధర్నాకు ముఖ్య అతిథులుగా రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాల వల్లే వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టబడిందని మండిపడ్డారు. సాగు ఖర్చులు పెరిగి గిట్టుబాటు ధరలు లేక పంటలు నష్టపోవడం వల్ల రైతులు అప్పులమీద అప్పులు పెరిగిపోయాయని, ఈ బాధలతో అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. అయినప్పటికీ పాలకుల్లో స్పందన కానరావడం లేదన్నారు. రైతే రాజు అన్న

- మిగతా 2 లో

సామాజిక అమరావతికి
పునాది వేశాం

- వెంకటపాలెం బహిరంగ సభలో సీఎం జగన్
- పేదల ఇళ్ల నిర్మాణానికి కృష్ణాయపాలెంలో శంకుస్థాపన

విశాలాంధ్ర-విజయవాడ: రాజధాని ప్రాంతంలో అన్ని వర్గాల వారు కలిసిమెలిసి జీవించేలా సామాజిక అమరావతి నిర్మాణానికి పునాది వేశామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ ద్వారా ఈడబ్ల్యూఎస్ లేఅవుట్‌లో రూ.1,829.57 కోట్ల వ్యయంతో అన్ని మౌలిక వసతులతో 50,793 ఇళ్ల నిర్మాణం కోసం గుంటూరు జిల్లా కృష్ణాయపాలెంలో సోమవారం ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం వెంకటపాలెంలో ఏర్పాటు చేసిన

- మిగతా 2 లో

నల్లజెండాలు, బలూన్‌లతో
రాజధాని రైతుల నిరసన

విశాలాంధ్ర-తుళ్లూరు: రాజధాని రైతులు, రైతు కూలీలు, మహిళలు నల్లజెండాలు, బలూన్‌లతో సీఎం జగన్‌కు నిరసన తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాజధాని అమరావతిలోని కృష్ణాయపాలెంలోని స్థలాల్లో గృహ నిర్మాణాలకు శంకుస్థాపన, వెంకటపాలెంలో బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో రైతులు, రైతు కూలీలు, మహిళలు దీక్షా శిబిరాలలో వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. తుళ్లూరు, వెంకటపాలెం దీక్షా శిబిరంలో మహిళా, రైతులు కళ్ళకు నల్లరిబ్బన్లు కట్టుకొని సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. నల్లజెండాలు పట్టుకుని నల్ల బలూన్లు ఎగురవేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతుల కష్టార్జితమైన భూముల్ని తన పార్టీ కార్యకర్తలకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు తమ సొంత భూములను పేదలకు పంచి వారిపై ప్రేమను చాటాలని హితవు పలికారు. చెల్లుబాటు కాని ఇళ్లను నిర్మించి పేదలను మోసం చేస్తున్నారని జగన్‌మోహన్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం సభ ముగిసిన అనంతరం సభాస్థలి నుంచి బస్సులు తిరిగి వెళుతున్న సమయంలో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

బయట బ్రతకడం చాలా కష్టంలాగుంది, నా శేషజీవితాన్ని జైలులోనే గడిపేస్తా గురూజీ!

నీటమునిగిన గిరిజన బతుకులు

- జలమయమైన తాళ్లూరు గ్రామం
- ఆర్ & బీ ప్యాకేజీ కింద భూమి ఇస్తేనే ఖాళీ చేస్తామన్న గ్రామస్తులు

విశాలాంధ్ర-దేవీపట్నం: అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని గోదావరి నదీ తీరం కొండ మొదలు పంచాయతీ తాళ్లూరు గ్రామ గిరిజనుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. తాళ్లూరులో సమారు 80 కుటుంబాల వారు నివసిస్తున్నారు. గ్రామం వరద ముంపులో చిక్కుకోవడంతో అధికారులు 30 కుటుంబాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పునరావాస కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవని సుమారు యాభై కుటుంబాలు ఇంకా గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. గోదావరికి వరద నీరు పోటెత్తడంతో ఇప్పుడు ఆ గ్రామం పూర్తిగా జలమయమైంది. అయినా అక్కడ గిరిజనులు ఎటువంటి భయాందోళనలు లేకుండా అక్కడే కొండల్లో తలదాచుకుంటున్నట్టు తెలిసింది. సోమవారం ఆ గ్రామానికి వెళ్లిన మీడియాకు అక్కడ పరిస్థితులు భయానకంగా

- మిగతా 2 లో

22-23 ఆర్థిక సంవత్సరానికి
ఈపీఎఫ్ వడ్డీ రేటు 8.15 శాతం

సీబీటీ నిర్ణయానికి కేంద్రం అంగీకారం

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) ఖాతాల్లో ఉండే సొమ్ముపై 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఇచ్చే వడ్డీ రేటు ఖరారైంది. ఆ ఏడాదికి 8.15శాతం వడ్డీ ఇవ్వాలని ఈపీఎఫ్ సెంట్రల్ బోర్డ్ ట్రస్టీ (సీబీటీ) తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈపీఎఫ్‌వో సోమవారం ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 8.15శాతం వడ్డీ ఇవ్వాలని ఈ ఏడాది మార్చి28న జరిగిన సమావేశంలో ఈపీఎఫ్ సెంట్రల్ బోర్డ్ ట్రస్టీ (సీబీటీ) నిర్ణయం తీసుకుంది. 2021-22లో ఇచ్చిన 8.10శాతంతో పోల్చితే ఇది 0.05శాతం అధికం. తదుపరి సీబీటీ ఈ నిర్ణయాన్ని కేంద్ర ఆర్థిక శాఖకు పంపించింది. తాజాగా ఆర్థికశాఖ కూడా ఈ వడ్డీ రేటుకు అనుమతించడంతో వడ్డీరేటుపై ఈపీఎఫ్‌వో ప్రకటన చేసింది. కేంద్రం నుంచి ఆమోదం లభించడంతో ఈపీఎఫ్‌వో ఫీల్డ్ అధికారులు త్వరలోనే ఈ వడ్డీ మొత్తాన్ని 6 కోట్ల మంది

- మిగతా 2 లో

క్యూబాపై దిగ్బంధాన్ని ఆపండి: డబ్ల్యుఎఫ్‌టీయూ

క్యూబా: 2023 ప్రెసిడెన్షియల్ కౌన్సిల్ ఏకగ్రీవ నిర్ణయానికి అనుగుణంగా వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యుఎఫ్‌టీయూ) క్యూబా ప్రజలకు సంఘీభావ ప్రచారాన్ని నిర్వహిస్తోంది, జులై 26, శాంటియాగో డి క్యూబాలోని మోన్‌కాడా బ్యారక్స్‌పై దాడి సందర్భంగా,డబ్ల్యుఎఫ్‌టీయూ అంతర్జాతీయవాద సందేశాన్ని వ్యాప్తి చేసింది. నియంత బాటిస్టాను గద్దె దించే విప్లవ ప్రయత్నానికి జూలై 26 నాంది. దశాబ్దాలుగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో క్యూబా ప్రజలు నాయకత్వం వహిస్తున్నారు. ఈ పోరాటాలకు క్యూబా మార్గదర్శకంగా నిలిచింది. ఈ రోజున శత్రువులను తరిమికొట్టడానికి పోరాడిన విప్లవకారులను స్మరించుకుంటాము, దశాబ్దాలుగా మరొక సమాజం సాధ్యమవుతుందనే విప్లవకారుల త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలి. పెట్టుబడిదారీ అనాగరికతకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గం చేస్తున్న పోరాటాలను వెలుగులోకి తీసుకురావాలని డబ్ల్యుఎఫ్‌టీయూ పిలుపునిచ్చింది. క్యూబా విప్లవం విజయం సాధించి దశాబ్దాలు గడిచినా క్యూబా ప్రజలు ఇప్పటికీ సామ్రాజ్యవాదం దాని జోక్యాలు, దిగ్బంధనాలు, ఆంక్షలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. కార్మికవర్గం తన చారిత్రాత్మక లక్ష్యాన్ని సాధించుకోగలదని, మనిషి-మనిషి దోపిడీ లేని సమాజం కోసం క్యూబా కంకణంకట్టుకుంది. ఆంక్షలు, నిషేధాలతో సంబంధం లేకుండా ఇతర దేశాలకు సహాయం, సంఘీభావం, వైద్యులు, మందులను క్యూబా సరఫరా చేస్తూనే ఉంది. బహుళజాతి సంస్థలకు వ్యతిరేకంగా క్యూబా ప్రజలు ప్రతిఘటిస్తూనే ఉంటారు. అదే సమయంలో క్యూబా ప్రజల పక్షాన నిలబడి, తమ బేషరతు మద్దతును, సంఘీభావాన్ని డబ్ల్యుఎఫ్‌టీయూ తెలియజేసింది.

ఆహార కొరతను పరిష్కరించాలని
బ్రిటన్‌లో ప్రదర్శన

బ్రిటన్: దేశంలో పెరుగుతున్న ఆహార పేదరికాన్ని పరిష్కరించాలని బ్రిటన్ అంతటా వేలాది మంది ప్రజలు పెద్ద ఎత్తున ప్రదర్శన చేపట్టారు. జీవన వ్యయ సంక్షోభాన్ని 'నివారించాలని ప్రజలు డిమాండ్ చేశారు. 'పీపుల్స్ అసెంబ్లీ ఎగైనెస్ట్ ఆస్టిరిటీ' అని నినదిస్తూ, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శనివారం దేశవ్యాప్తంగా నిరసనలు, కార్యక్రమాలు చేపట్టారు. సూపర్ మార్కెట్లు తమ లాభాలను నియంత్రించి ఆహార ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. అందరికీ అందుబాటులో ఉండేలా ఆహారంపై ధరల నియంత్రణను ప్రవేశపెట్టాలని, దేశవ్యాప్తంగా పిల్లలందరికీ ఉచిత పాఠశాల భోజనం అందించాలని కోరారు.

స్కాట్లాండ్‌లోని కాంప్‌బెల్ సిటీ కౌన్సిల్ ప్రధాన కార్యాలయం వెలుపల నిరసనకారులు పెద్ద ఎత్తున నినదించారు. "ఆహార పేదరికం అన్ని ఇతర రకాల పేదరికం దేశ ఆర్థిక వ్యవస్థ ప్రత్యక్ష ఫలితం, పట్టణాలు, నగరాల్లో ప్రజల డిమాండ్‌లను తెలియజేయడానికి స్టాల్స్ ఏర్పాటు చేశారు. దేశంలో 4.2 మిలియన్ల మంది పిల్లలు పేదరికంలో మగ్గుతున్నారు. వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న పరిస్థితి భయంకరంగా ఉంది. దేశంలో సంపద అసమానత, పేదరికం తారాస్థాయిలో ఉంది.

టాంజానియాలో ఆఫ్రికా దేశాల సమ్మిట్

టాంజానియా : టాంజానియాలోని అతిపెద్ద నగరమైన దార్ ఎస్ సలామ్‌లో జూలై 25-26 రెండురోజులపాటు ఆఫ్రికా హ్యూమన్ క్యాపిటల్ హెడ్స్ ఆఫ్ స్టేట్ సమ్మిట్ జరగనుంది. ఈ సమ్మిట్‌కు వివిధ ఆఫ్రికన్ దేశాల నుంచి కనీసం పన్నెండు వందల మంది ప్రతినిధుల హాజరుకానున్నారు. ఈ విషయాన్ని దార్ ఎస్ సలామ్ ప్రాంతీయ కమిషనర్ అల్బర్ట్ చలమిలా ఆదివారం వెల్లడించారు. ఈ సమ్మిట్‌కి 30 దేశాలకు పైగా ఆఫ్రికన్ దేశాల నుండి దేశాధినేతలు, ప్రతినిధులు హాజరుకానున్నారని చలిమిల తెలిపారు. ఇప్పటికే ఈ సమ్మిట్‌కి తరలివస్తున్న ఆఫ్రికన్ దేశాల ప్రతినిధులకు స్వాగతం పలికేందుకు దార్ ఎస్ సలామ్ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన ప్రతినిధులు టాంజనియా దేశంలోని పర్యాటక ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉందని చలమిలా అన్నారు.

కాగా, ప్రపంచబ్యాంకు మద్దతుతో.. ఆఫ్రికా దేశాల ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, నైపుణ్యాలను మెరుగుపరచడం ద్వారా యువత ఉత్పాదకతను పెంచడం అనే థీమ్‌తో ఈ సమ్మిట్ నిర్వహించడుతుందని అధికారిక నివేదికలు తెలిపాయి. ఈ సందర్భంగా చలమిలా మాట్లాడుతూ.. 'మిగతా ఆఫ్రికా దేశాల మాదిరిగానే టాంజానియా దేశంలో కూడా నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ సమ్మిట్‌లో టాంజనియా దేశం తరపున నిరుద్యోగ సవాళ్లను ఎదర్కోవడానికి అవలబించే ఉత్తమ పద్ధతులను ప్రదర్శించడం జరుగుతుంది' అని అన్నారు

30న పీఎస్‌ఎల్‌వీ సీ56 ప్రయోగం
నింగిలోకి ఏడు ఉపగ్రహాలు

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమవుతున్నది. ఈ నెల 30న పీఎస్‌ఎల్‌వీ సీ56 ప్రయోగం చేపట్టనుంది. సింగపూర్‌కి చెందిన డీఎస్-ఎస్ఏఆర్ ఉపగ్రహంతోపాటు మరో ఆరు శాటిలైట్లను నింగిలోకి పంపనున్నది. ఏపీలోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్‌ధవన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఆదివారం ఉదయం 6.30 గంటలకు సింగపూర్‌కి చెందిన డీఎస్-ఎస్ఏఆర్ ఉపగ్రహంతోపాటు మరో ఆరు శాటిలైట్లను నింగిలోకి పంపనున్నట్లు ఇస్రో సోమవారం వెల్లడించింది. సింగపూర్ ప్రభుత్వ ఏజెన్సీలకు ఉపగ్రహ ఛాయాచిత్రాల అవసరాల నిమిత్తం డీఎస్-ఎస్ఏఆర్‌ను ప్రయోగిస్తున్నారు.డీఎస్ ఎస్ఏఆర్‌తోపాటు టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ మైక్రో శాటిలైట్ వెలాక్స్-ఏఎం, ఎక్స్‌పరిమెంటల్ శాటిలైట్ 'ఆర్కేడ్', 3యూ నానోశాటిలైట్ 'స్కూబ్-2', ఐవోటీ కనెక్టివిటీ నానోశాటిలైట్ 'నూలయన్', గలాసియా-2, ఓఆర్‌బీ-12 స్ట్రైడర్ ఉపగ్రహాలను కూడా రోదసిలోకి పంపనున్నారు. చంద్రుడిపై పరిశోధనల కోసం ఇస్రో ఇటీవలే చంద్రయాన్-3ని విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే.

ఈపీఎఫ్ వడ్డీ రేటు 8.15శాతం

(మొదటిపేజీ తరువాయి)

చందాదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. 2022 మార్చిలో ఈపీఎఫ్‌పై వడ్డీ రేటును నాలుగు దశాబ్దాల కనిష్ఠ స్థాయికి తగ్గించిన విషయం తెలిసిందే. 8.5 శాతంగా ఉన్న వడ్డీ రేటును 2021-22 ఏడాదికి 8.1 శాతానికి మోదీ ప్రభుత్వం తగ్గించింది. 1977-78 ఆర్థిక సంవత్సరంలో 8 శాతం వడ్డీ ఇవ్వగా.. ఆ తర్వాత 2021-22 ఏడాదిదే అత్యంత తక్కువ వడ్డీ రేటు. 2015-16 ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్ వడ్డీ రేటు 8.8 శాతం ఉండగా.. అప్పటి నుంచి ఒక్క ఏడాది మినహా వడ్డీ రేటు క్రమంగా తగ్గించారు. తాజాగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి వడ్డీ రేటును స్వల్పంగా పెంచారు.

రాజధాని రైతుల నిరసన

(మొదటిపేజీ తరువాయి)

దీక్షా శిబిరం నుంచి రైతులు, మహిళలు రోడ్డుపైకి వచ్చి జోరు వర్షంలోనూ నిరసన తెలిపారు. బిల్డ్ అమరావతి-సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. మందడం దీక్షా శిబిరంలోనూ రైతులు నిరసన తెలిపారు. మందడం రైతు దీక్షా శిబిరంలో రైతులు మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ఓట్లు కోసమే ఇళ్ళ స్థలాల పంపిణీ అంటూ ఆర్భాటం చేస్తున్నారని మండిపడ్డారు. మా సమాధులపై నడుచుకుంటూ ఎన్నికలకు వెళ్లాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా సీఎం సభ నేపథ్యంలో దళిత జేఏసీ నాయకుడు పులి చిన్నా సహా మరికొందరని పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. తాము కోర్టుకు హాజరు కావాల్సి ఉందని చెప్పడంతో సీఎం కార్యక్రమాలు జరుగుతున్న మార్గంలో కాకుండా వేరే మార్గంలో వెళ్లాలని సూచిస్తూ వారిని వదిలేశారు.

మణిపూర్ మంటలు

(మొదటిపేజీ తరువాయి)

నినాదాలు చేశాయి. ఈ సందర్భంగా రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖడ్గే విలేకరులతో మాట్లాడుతూ మణిపూర్ హింసపై పార్లమెంటులో సమగ్ర ప్రకటన చేయాల్సిన బాధ్యత ప్రధాని మోదీదని స్పష్టంచేశారు. 'మణిపూర్‌లో వాస్తవ పరిస్థితులు ఏమిటో ప్రధాని వెల్లడించాలి. కానీ మోదీ సభ లోపలికి రావడం లేదు. ఆయన కార్యాలయంలోనే కూర్చుంటున్నారు. పార్లమెంటు లోపలకు రావడానికి భయపడుతున్నారు' అని ఖడ్గే విమర్శించారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తనతోనూ, టీఆర్‌బాలు సహా ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలతోనూ సమావేశమయ్యారని ఖడ్గే తెలిపారు. పార్లమెంటు లోపల ప్రధాని ప్రకటన చేయాలని, దానిపై చర్చకు అనుమతించాలని తాము నిక్కచ్చిగా స్పష్టంచేశామని తెలిపారు. సుదీర్ఘ చర్చకు అనుమతించే 267 నిబంధన కింద చర్చ జరగాలని తాము డిమాండ్ చేస్తున్నామని, కానీ కేవలం అర్ధగంట జరిగే స్వల్పకాల చర్చకే ప్రభుత్వం మొగ్గు చూపుతోందని విమర్శించారు. 267 నిబంధన కింద చర్చ చేపడితే అవసరమైతే ఓటింగ్ కూడా నిర్వహించాల్సి ఉంటుందని, దానికి ప్రభుత్వం భయపడుతోందని ఖడ్గే ఆరోపించారు. 'స్వల్పకాలిక చర్చతో సమస్యకు పరిష్కారం లభించదు. మీరు 140 కోట్లమందికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మీరు సభకు ఎందుకు రావడం లేదు? నిజాలు ఎందుకు చెప్పడం లేదు' అని నిలదీశారు. సభ జరుగుతున్నప్పుడు ప్రధాని కానీ, ముఖ్యమంత్రి కానీ బయట ప్రకటన చేయరని, ఇది సంప్రదాయమని గుర్తుచేశారు. ఈ సంప్రదాయాన్ని మోదీ మొదటిసారి పాటించారని ఆరోపించారు. మోదీ సభకు వచ్చి...ప్రకటన చేయాలని తాము మరోసారి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. మణిపూర్‌పై మోదీతో ప్రకటన చేయించాలని రాజ్యసభ చైర్మన్, లోక్‌సభ స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రాజ్యాంగ బాధ్యతల నుంచి మోదీ ప్రభుత్వం, బీజేపీ పారిపోకూడదని, మణిపూర్‌పై జవాబుదారీతనాన్ని ప్రదర్శించాలని ఖడ్గే డిమాండ్ చేశారు.

రైతు రుణ మాఫీ చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నినాదం కేవలం పాలకుల ఉపన్యాసాలకే పరిమితమవుతుందని విమర్శించారు. పారిశ్రామికవేత్తలు తమ కంపెనీలు ఉత్పత్తి చేసే వస్తువులకు మార్కెట్ ధరలకనుగుణంగా రేట్లు ఏటేటా గణనీయంగా పెంచి లాభాలు దండుకుంటుండగా, వారికే ప్రభుత్వాలు వేల కోట్లు రాయితీలిస్తున్నాయన్నారు. రైతుకు మాత్రం తాను పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు ధర నిర్ణయించుకునే అధికారం లేదని, మరోపక్క పాలకులూ కరుణించడం లేదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతుల దగ్గర పెట్టుబడులకు డబ్బులు లేకపోవడం వల్ల వ్యవసాయం వైపు మొగ్గు చూపలేకపోతున్నారని, తెలంగాణ ప్రభుత్వం తరహాలో ఎకరాకు పదివేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. రైతు ఆత్మహత్యల నివారణకు కేరళ ప్రభుత్వం తరహాలో సంపూర్ణ రుణమాఫీ ప్రకటించాలని కోరారు. సమగ్ర పంటల బీమా విధానాన్ని ప్రవేశపెట్టి దిగుబడి ఆధారంగా పంటల బీమాని వర్తింపచేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం రైతులందరూ సమిష్టిగా ఉద్యమించాలని ప్రసాద్ పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీశ్ మాట్లాడుతూ కర్నాటక ప్రభుత్వం తుంగభద్ర నదిపై ఎగువభద్ర, నవలి ప్రాజెక్టులు నిర్మిస్తున్నందున రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని ప్రాజెక్టు నిర్మాణాలు ఆపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతులు సంక్షోభంలో కూరుకుపోయారని, పంటల సాగు చేయలేని దుస్థితిలో ఉన్నారని, ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే తినడానికి తిండి కరువయ్యే పరిస్థితి దాపురిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నప్పయాదవ్, లింగమయ్య, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు.

మద్దతు ధర కోసం చట్టం చేయాలి: దేగా ప్రభాకర్

రైతు, కౌలు రైతు పండించిన పంటకు మద్దతు ధర కోసం చట్టం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు దేగా ప్రభాకర్ డిమాండ్ చేవారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దేగా ప్రభాకర్, దొంతా కృష్ణ మీడియాతో మాట్లాడుతూ కటాఫ్ తేదీతో నిమిత్తం లేకుండా కౌలు కార్డులు ఉన్నవారందరినీ గుర్తించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు. ఎరువులు, పురుగు మందులు, డ్రిప్ పరికరాలు 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వమే అందజేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతు, కౌలు రైతులకు నెలకు రూ.10 వేలు పింఛను ఇవ్వాలని, రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయాలని, రైతు రుణ విమోచన చట్టం తేవాలని డిమాండ్ చేశారు.

ఎన్టీఆర్ జిల్లాలో

రైతు సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్టీఆర్ జిల్లా నందిగామలో రైతులు సీపీఐ కార్యాలయం నుంచి గాంధీ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి, ధర్నా చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు దోనేపుడి శంకర్, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య మాట్లాడుతూ అన్ని పంటలకు సర్వే నెంబరు యూనిట్‌గా పంటల బీమా వర్తింపచేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కన్వీనర్ చుండూరు వెంకట సుబ్బారావు, ఏఐయస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుటూరి అరుణ్ కుమార్, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్టా చామంతి, మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు, పట్టణ కార్యదర్శి వేముల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటమునిగిన గిరిజన బతుకులు

(మొదటిపేజీ తరువాయి)

దర్శనమిచ్చాయి. గ్రామం చుట్టూ వరదనీరు చేరడంతో ఇళ్లపై తట్ట బుట్ట సర్దుకొని... కొండల్లో తలదాచుకుంటున్నారు. అక్కడ వాళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నెత్తి మీద వర్షం... కింద చెట్టూ చేమా... దోమలు, విష పురుగుల మధ్య ఉంటున్నారు. గోదావరి నీటి మట్టం గణనీయంగా పెరగటంతో తాళ్లూరు గ్రామానికి వెళ్లాలంటే అధికారులకు కత్తిమీద సాములా మారింది. అధికారులు ముందే నచ్చచెప్పినా లెక్కపెట్టని ఆ గ్రామస్తులు తమకు మెరుగైన పునరావాసం, అర్ అండ్ అర్ ప్యాకేజీ కింద భూమికి భూమి అందించాలని అప్పటి వరకు గ్రామాన్ని ఖాళీ చేసేది లేదని భీష్మించుకు కూర్చున్నారు . ఇప్పుడు ఆ గ్రామస్తుల వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది. ఏటా గోదావరికి సంభవించే వరదలు వారికి మామూలే అయినా... వారిని పట్టించుకోలేదన్న నింద పడుతుందేమోనన్న భయం అధికారులకు పట్టుకుంది. అన్నీ ఇస్తే తప్ప గ్రామాన్ని ఖాళీ చేసేది లేదని గిరిజనులు స్పష్టం చేస్తున్నారు.

వైసీపీలో ఆధిపత్య పోరు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో రామచంద్రాపురం టికెట్ తనదేననే సంకేతాలను తన అనుచరుల ద్వారా చెప్పిస్తున్నారు.

తనయుడికి సీటు కోసం బోస్ యత్నం

వచ్చే ఎన్నికల్లో రామచంద్రాపురం నుంచి తన తనయుడిని రాజకీయ రంగ ప్రవేశం చేయించాలని పిల్లి సుభాష్ చంద్రబోస్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఈ విషయం తెలిసిన వేణుగోపాలకృష్ణ అనుచరులు నియోజకవర్గంలో తమ కార్యకలాపాలను వేగవంతం చేశారు. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న వేణుగోపాలకృష్ణకు, బోస్‌కు మధ్య ఆధిపత్య పోరు ఉధృతమైంది. వేణు బరిలో ఉంటే మద్దతిచ్చేది లేదంటూ తమ కేడర్ చెబుతున్నారని బోస్ బహిరంగంగా చెప్పారు. తమ కుటుంబం నుంచే ఎవరో ఒకరు పోటీ చేయాలని కోరుతున్నారన్నారు. తనకు కేడరే ముఖ్యమని, రాజ్యసభకు రాజీనామా చేస్తానని, అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని వ్యాఖ్యానించారు. రెండు వర్గాలు రామచంద్రాపురం కేంద్రంగా ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ, తమ బలాబలాల్ని ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తున్నారు. మంత్రి వేణు ఆత్మీయ సమావేశానికి పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు ఆహ్వానం పంపకపోడంపై ఆయన అనుచరులు ఆగ్రహంగా ఉన్నారు. ఇటీవల తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎంను బోస్ కలిసినా ప్రయోజనం కనిపించడం లేదు. తమ కేడర్‌పై మంత్రి వేణుగోపాలకృష్ణ ఇష్టానుసారం కేసులు పెడుతున్నారని సీఎం జగన్ దృష్టికి బోస్ తీసుకొచ్చారు. తమ కుటుంబానికే టికెట్ ఇవ్వాలని బోస్ అడుగుతున్నారు.

తాజాగా రామచంద్రాపురం వ్యవహారంపై సీఎంవోకు వైసీపీ నేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వచ్చారు. మంత్రి వేణుపై తోట ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో పరిస్థితులు బాగోలేదన్నారు. దీంతో తోట త్రిమూర్తులతో ప్రాంతీయ సమన్వయకర్త, ఎంపీ మిథున్‌రెడ్డి, సీఎంవో కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి గంటసేపు భేటీ అయ్యారు. రామచంద్రాపురంలో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. మూడు, నాలుగు రోజుల్లో సీఎంతో వైసీపీ నేతలు భేటీ కానున్నారు.

గన్నవరంలోనూ టికెట్ కుంపటి

తాజాగా గన్నవరం నియోజకవర్గ టికెట్ వ్యవహారం తెరపైకి వచ్చింది. టీడీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అక్కడ వైసీపీకి మద్దతుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. గత ఎన్నికల్లో వంశీపై స్వల్ప ఓట్లతో ఓటమి పాలైన యార్లగడ్డ వెంకట్రావ్...వంశీ పాత్రపై మండిపడుతున్నారు. గన్నవరం నియోజకవర్గం హనుమాన్ జంక్షన్‌లో వైసీపీ సీనియర్ నేత రామచంద్రరావుతో యార్లగడ్డ భేటీ అయ్యారు. వచ్చే ఎన్నికల్లో గన్నవరం నుంచి పోటీ చేస్తానని, గన్నవరం రాజకీయాల్లోనే కొనసాగుతానని యార్లగడ్డ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. టికెట్ల కోసం బలప్రదర్శనలతో నేతలు నిమగ్నమవడం వైసీపీ అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది.

రెండు నెలల తర్వాత మణిపూర్‌కు గూడ్స్ రైలు

ఇంఫాల్: మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో దాదాపు రెండు నెలలుగా నిలిచిపోయిన గూడ్స్ రైల్వే సేవలను పునరుద్ధరించారు. గుహవతి నుంచి తమెంగ్‌లాంగ్ జిల్లా ఖోంగ్సాంగ్‌కు నిత్యావసరాలు, ఆహార ధాన్యాలు తీసుకొచ్చిన రైలుకు ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్ సోమవారం స్వాగతం పలికారు. మే 3న ఘర్షణలు చోటు చేసుకున్న తర్వాత తొలిసారి ఆయన ఆదివాసీల ప్రాబల్యం ఎక్కువగా ఉండే జిల్లాలోకి అడుగుపెట్టారు. కాగా, మే 5 నుంచి ఈ రాష్ట్రంలో రైల్వే సేవలు నిలిచిపోయాయి. 'ఈరోజు ఖోంగ్సాంగ్ రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలు రాకను చూడటం ఆనందంగా ఉంది. ఈ పరిణామం మణిపూర్ ప్రజలకు అనేక అవకాశాలు రాబోతున్నాయని సూచిస్తోంది. నిత్యావసర వస్తువులు, వేగవంతమైన రవాణా సాధ్యపడనుంది. ఇలాంటి రవాణాతో పారిశ్రామిక వృద్ధి పరుగులు పెడుతుంది. వాణిజ్యం పెరిగితే అది జీవన నాణ్యతను మెరుగుపరుస్తుంది. ఈ చొరవతో రాష్ట్ర ఆర్థిక అవకాశాలను పురోగమించడంలో కీలక పాత్ర పోషించినందుకు ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు' అంటూ సీఎం బీరేన్ సింగ్ ట్వీట్ చేశారు.

సామాజిక అమరావతికి పునాది వేశాం

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ పేదల శత్రువులతో యుద్ధం చేస్తున్నామని చెప్పారు. స సుదీర్ఘపోరాటం తర్వాత విజయం సాధించి...ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో నేడు ఓ ప్రత్యేకత గల రోజుగా నిలిచిపోతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వకుండా ఈనాడు, ఆంధ్రజ్యోతి, చంద్రబాబు, దత్తపుత్రుడు, ఊరూపేరూ లేని సంఘాలు అడ్డుకున్నాయని ఆరోపించారు. ఇందుకోసం కేంద్ర పెద్దలను కలిశారని, కోర్టులకు వెళ్లారని మండిపడ్డారు. మీ తరపున మీ బిడ్డ పోరాటం చేశారని తెలిపారు. చివరకు రాష్ట్ర ప్రభుత్వమే గెలిచి పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. సామాజిక న్యాయపోరాటంలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. పెత్తందారులపై ప్రజల ప్రభుత్వంగా నిలిచిపోతుందన్నారు. పేదలకు ఇక్కడ ఇళ్లు ఇస్తే కులాల సమతుల్యత దెబ్బతింటుందని గజదొంగల ముఠా దుష్ప్రచారం చేసిందని విమర్శించారు. అమరావతిలో ఉండేందుకు అమెరికా వాళ్లు, సింగపూర్ వాళ్లు రావచ్చు గానీ...పక్క గ్రామాల్లో ఉన్న పేదలు రాకూడదని చెపుతున్నారని ఆరోపించారు.

రాజధాని ప్రాంతంలో ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆప్షన్-3 కింద లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇక్కడ నిర్మించే ఒక్కో ఇల్లు విలువ 5 నుంచి 10 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ వైసీపీ ప్రభుత్వం మాత్రమే చేస్తున్నదని వివరించారు. గృహ నిర్మాణ శాఖమంత్రి జోగి రమేశ్ ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, బాపట్ల ఎంపీ నందిగం సురేశ్ మాట్లాడారు. మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజని, ఆదిమూలపు సురేశ్, మేరుగు నాగార్జున, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మణిపూర్‌పై మాటలయుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే సహా కొంతమంది ప్రతిపక్ష నేతలతో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఫోన్‌లో మాట్లాడారు. పార్లమెంటులో ప్రతిష్ఠంభనకు స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు. మణిపూర్ హింసపై ప్రధాని ప్రకటన చేయాలన్న డిమాండ్‌తో విపక్ష సభ్యులు నినాదాలు, ప్లకార్డులు ప్రదర్శించడంతో సోమవారం కూడా పార్లమెంటు ఉభయసభలు నిరసనలు, వాయిదాలతో వాయిదా పడ్డాయి. చర్చకు సిద్ధమని, మణిపూర్‌పై హోంమంత్రి మాట్లాడతారని ప్రభుత్వం తెలిపింది. అయితే, ప్రధాని మాత్రమే ప్రకటన చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. మణిపూర్ సమస్య తీవ్రతను ప్రభుత్వం తక్కువ చేస్తోందని ఖడ్గే ఆరోపించారు. ప్రధాని పార్లమెంటులో ప్రకటన చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని, దీనిపై తాము చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టంచేశారు. మోదీ పార్లమెంటు బయట మాట్లాడుతున్నారని, దీనిద్వారా మోదీ పార్లమెంటును అవమానిస్తున్నారని మండిపడ్డారు. ఇది చాలా తీవ్రమైన సమస్య అని వ్యాఖ్యానించారు.

శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ మణిపూర్‌లో హింసను అదుపుచేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ఈ అంశంపై మోడీ మాట్లాడాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇప్పటికి 80 రోజులైనా హింస ఆగలేదని చెప్పారు. మోదీ దీనికి బాధ్యత వహించాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. పార్లమెంటు బయట కేవలం 36 సెకండ్లు మాత్రమే మాట్లాడారని, పార్లమెంటు ద్వారా దేశానికి ప్రధాని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంత దారుణాలు జరుగుతున్నా మణిపూర్ సీఎంను ఇంకా ఎందుకు తప్పించలేదని నిలదీశారు. మహిళా, శిశు అభివృద్ధి శాఖమంత్రి ఎందుకు మణిపూర్‌లో పర్యటించలేదని ప్రశ్నించారు.

జేడీయూ నాయకుడు లాలన్ సింగ్ మాట్లాడుతూ మణిపూర్ ఘటనలు దేశానికి సిగ్గుచేటన్నారు. మణిపూర్‌లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని, అయినా అక్కడి పరిస్థితులను తక్కువగా చూస్తోందని ఆరోపించారు. సభలో మోదీ ప్రకటన చేయాలన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు. టీఎంసీ ఎంపీ సౌగతరాయ్ మాట్లాడుతూ మణిపూర్‌లో అత్యాచారాలకు నిరసనగా మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఆందోళనలు చేయాలని తమ పార్టీ నిర్ణయించిందన్నారు. పార్లమెంటులో చర్చ జరగాలని తాము కోరుతున్నామని, దీనికి ప్రధాని చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మరోవైపు, బీజేపీ నాయకులు సుధాన్షు త్రివేదీ స్పందిస్తూ చర్చ నుంచి ప్రతిపక్షాలు పారిపోతున్నాయని ఎదురుదాడి చేశారు. ఇతర రాష్ట్రాల్లో మహిళలపై జరుగుతున్న హింసపై ఎందుకు మౌనం వహిస్తున్నాయని ప్రశ్నించారు. రాజస్తాన్, పశ్చిమబెంగాల్‌లో మహిళలపై దాడులకు సంబంధించి ప్రతిపక్షాలు మౌనం వహిస్తున్నాయని, తన సొంతమంత్రి చెప్పిందే రాజస్తాన్ ముఖ్యమంత్రి వినిపించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ ప్రతిపక్షాలను క్షమించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభం రోజే ప్రధాని మోదీ మణిపూర్‌పై ప్రకటన చేశారని చెప్పుకొచ్చారు.

అదానీకి భూములు కట్టబెట్టడానికే...

మణిపూర్ హింసపై నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: మణిపూర్‌లో అత్యంత పాశవిక పరిస్థితులు కొనసాగుతున్నాయని, అక్కడి పరిణామాల పట్ల మోదీ ప్రభుత్వం ఉదాసీనత ప్రదర్శిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. తిరుపతి పరిధిలోని ఏబీ బర్ధన్ కాలనీలో నిర్మించిన బర్ధన్ కమ్యూనిటీ భవన్‌ని నారాయణ సోమవారం ప్రారంభించారు. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడుతూ మణిపూర్‌లో విలువైన, సంపద గల భూములు గల కొండ ప్రాంతంలో గిరిజనులు జీవిస్తున్నారని, ఆ భూ సంపదను కొట్టేయడానికి బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని చెప్పారు. పారిశ్రామికవేత్త అదానీకి ఇప్పటికే అక్కడ గల 54వేల ఎకరాల భూమి అప్పగించిందని తెలిపారు. దీనికి అడ్డుపడుతున్న గిరిజనులపై మరో వర్గాన్ని పురిగొలిపి అల్లర్లు సృష్టిస్తున్నట్లు నారాయణ ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే కార్గిల్ వీరుడి భార్య, బిడ్డపై అత్యాచారం జరిగిందని, దీనిని అడ్డుకున్న కుమారుడిని చంపేశారని వివరించారు. స్వతంత్ర భారతదేశంలో ఇలాంటి అకృత్యాలు జరగడం దురదృష్ట కరమన్నారు. ఈ ఘటన మే 4వ తేదీ జరిగితే మే 28న కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్కడకు వెళ్లారని, దాన్ని గురించి ఎక్కడా ఆయన ప్రస్తావించలేదన్నారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభించే ముందు రోజు ఒక వీడియో రిలీజ్ చేసి అక్కడ గొడవలు లేవదీసి బయటికి పంపే ప్రయత్నం చేశారన్నారు. కుట్ర పూరితంగానే మణిపూర్‌లో బీజేపీ మంటలు సృష్టించిందని విమర్శించారు. బీజేపీకి స్వార్థ రాజకీయం తప్ప ప్రజా సంక్షేమం పట్టదన్నారు. మోదీ సర్కారును వ్యతిరేకించే బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను వేధింపులకు గురిచేస్తున్నదని, కేసులతో బెదిరింపులకు పాల్పడుతున్నదని ఆరోపించారు. ఇప్పటికే దేశంలో 35 రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చి మోదీ హఠావో నినాదం తీసుకొచ్చాయని గుర్తుచేశారు. బీజేపీకి వ్యతిరేకిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కనిపించినా...వారి అడుగులకు మడుగులొత్తుతున్నారని విమర్శించారు. బీజేపీతో చేతులు కలపడం ద్వారా రాజకీయ ఆత్మహత్యకు టీడీపీ, జనసేన పాల్పడుతున్నాయని చెప్పారు. దేశంలో లౌకిక వ్యవస్థను కాపాడేందుకు వామపక్షాలు పోరాటం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతతో బీజేపీని గద్దె దించడం ఖాయమని నారాయణ స్పష్టం చేశారు. నక్కను చూసి వాతపెట్టుకున్న చందాన విపక్షాల భేటీని చూసి.. ఎన్‌డీఏ భాగస్వాములతో బీజేపీ హడావుడిగా సమావేశమైందని విమర్శించారు. ఎన్‌డీఏ భేటీలో పాల్గొన్న కొన్ని పార్టీలకు ఎంపీలుగానీ, ఎమ్మెల్యేలు గానీ లేరని చెప్పారు. బీజేపీకి మద్దతిస్తున్న పవన్ కల్యాణ్...రాష్ట్రానికి కేంద్రం ఏమి చేసిందో తెలుసుకోవాలని హితవు పలికారు. బీజేపీకి ఎవరు మద్దతు పలికినా తెలుగువారికి ద్రోహం చేసినట్లేనని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, కుమార్‌రెడ్డి, నదియా, నగర కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను సత్వరమే ఆదుకోవాలి

విశాలాంధ్ర-బెలగాం: అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే డిపాజిట్లు ఇప్పించాలని అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవి నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ముందుగా పార్వతీపురం సీపీఐ జిల్లా కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు అసోసియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు అధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. జనసేన నాయకుడు అక్కివరపు మోహనరావు ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా ఈవీ నాయుడు మాట్లాడుతూ... గత ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా నాటి ప్రతిపక్ష నేత, నేటి సీఎం వైఎస్ జగన్... అధికారం చేపట్టిన ఆరు నెలల్లో వడ్డీతో సహా డిపాజిట్లను చెల్లించి అగ్రి గోల్డ్ బాధితులకు పూర్తి న్యాయం చేకూరుస్తానని పదే పదే చెప్పారన్నారు. వారం రోజుల్లో ఇరవై వేల రూపాయలు లోపు ఉన్న డిపాజిట్ దారులకు 1183 కోట్లు కేటాయించి 14 లక్షల మందికి సంపూర్ణ న్యాయం చేస్తామన్నారని, నేటికీ 906 కోట్ల రూపాయలు మాత్రమే ఇచ్చారన్నారు. ఇంకా మూడున్నర లక్షల మందికి పైగా 20వేల రూపాయల లోపు డిపాజిట్ చేసిన బాధితులు ఎదురు చూస్తున్నారన్నారు. ఒకటికి మించి బాండ్లు కలిగిన వేలాది మంది పేదలకు సత్వర న్యాయం చేయమని కోరుతున్నామన్నారు. కోర్టు కేసులను తమ ప్రభుత్వం చూసుకుంటుందని చెప్పిన మాట మేరకు బాధితులకు న్యాయం చేకూర్చే విషయంలో సీఎం కోర్టును అడ్డుగా చూపరాదని, కంపెనీ ఆస్తులను ప్రభుత్వమే స్వాధీన పరచుకొని మొత్తం బాధితులకు 2023 ఆగస్టు 15వ తేదీ లోగా చెల్లింపులు చేయించాలని కోరుతున్నామన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, డిపాజిట్‌దారులకు న్యాయం చేకూర్చాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల్లో
కార్గో ఆపరేషన్స్ నిలిపివేత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల్లో డొమెస్టిక్ ఎయిర్ కార్గో కార్యకలాపాలను నిలిపివేసినట్లు పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ స్పష్టం చేశారు. రాజ్యసభలో సోమవారం వైసీపీ సభ్యుడు విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ కార్గో రెగ్యులేటెడ్ ఏజెంట్ అభ్యర్థన మేరకు అవుట్ బౌండ్ డొమెస్టిక్ ఎయిర్ కార్గో కార్యకలాపాలను నిలిపివేసినట్లు చెప్పారు. అలాగే అన్ని ఎయిర్‌పోర్టుల్లో కామన్ యూజర్ డొమెస్టిక్ ఎయిర్ కార్గో టెర్మినల్ (సీయూడీసీటీ) కార్యకలాపాలను నిలిపివేయాలని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) తీసుకున్న నిర్ణయం కారణంగా విజయవాడ విమానాశ్రమంలో సైతం డొమెస్టిక్ ఎయిర్ కార్గో కార్య కలాపాలను నిలిపివేసినట్లు మంత్రి వివరించారు. విశాఖ విమానాశ్రయం నుంచి మాత్రం అన్ని కార్గో కార్యకలాపాలు యథావిధిగా కొనసాగు తున్నట్లు మంత్రి తెలిపారు. డొమెస్టిక్ ఎయిర్‌కార్గోను స్వయంగా నిర్వహి స్తామంటూ ఇండిగో ఎయిర్‌లైన్స్‌ను నిర్వహిస్తున్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ సంస్థ ముందుకు వచ్చినందున దీనిపై ప్రతిపాదనలను సమర్పించ వలసిందిగా బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ విజయవాడ, తిరుపతి ఎయిర్‌పోర్ట్ అధికారులను కోరినట్లు మంత్రి వెల్లడించారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

రవీంద్రనాథ్, ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పనులు చేయించుకుంటూ శ్రమకు తగిన ఫలితం ఇవ్వటం లేదని, తెలంగాణ కంటే వెయ్యి రూపా యలు ఎక్కువ పెంచి ఆంధ్రప్రదేశ్‌లో వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, జి.ఓబులేసు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి సమావేశం విజయవాడలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాల యంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జె.హెల్డా ఫ్లోరెన్స్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రవీంద్రనాథ్, ఓబులేసు పాల్గొని అసోసియేషన్‌కు సంబంధించి అనేక సలహాలు, సూచనలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ప్రతినెలా వేతనాలు, సెంటర్లకు సంబంధించిన బిల్లులను ఐదో తేదీ లోపల చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గుంటూరులోని స్త్రీ, శిశుసంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ వసంతబాలకి రాష్ట్ర ఆఫీస్ బేరర్లు జె.లలిత, సుగుణమ్మ, ఎస్.సరోజినమ్మ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆగస్టులో గర్భవతులకు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్‌ను ఫొటోలు లేకుండా పాత పద్ధతిలో సంతకాలతో ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన మొబైల్స్ పనిచేయడం లేదని తెలిపారు. అంగన్వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగి అంటూ ప్రజాసాధికారత సర్వేలో నమోదు కాకుండా చూడాలని కోరారు. అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, పదవీ విరమణ తర్వాత పెన్షన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలని సూచించారు. 2017 నుండి టీఏ, డీఏ చెల్లించాలని, ప్రతి నెలా ఐదో తేదీకి గౌరవ వేతనాన్ని, సెంటర్లకు సంబంధించిన బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, విధులలో చని పోయిన వారికి ఐదు లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని, వారి ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. నాణ్యమైన మూడు జతల యూనిఫారాలు ఇవ్వాలని విన్నవిం చారు. జేడీ వసంతబాల స్పందిస్తూ డైరెక్టర్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వైఎఫ్ విజయవాడ నగర
అధ్యక్ష కార్యదర్శులుగా భార్గవ, గోవిందరాజులు

విశాలాంధ్ర -విజయవాడ (చిట్టినగర్): అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విజయవాడ నగర అధ్యక్ష, కార్యదర్శులుగా కంచర్ల భార్గవ, లంకా గోవిందరాజులు ఎన్నికయ్యారు. ఈ మహాసభ ఆదివారం జరిగింది. ఉపాధ్యక్షులుగా సైకం రాము, శిరం రవి, ఎన్. వెంకటేశ్వరరావు, పి. విశాల్, ఏ జనార్ధన్, బి.శివకృష్ణ, ఎస్ మోహన్ కుమార్, సహాయ కార్యదర్శులుగా లంకే సాయి కుమార్, లాల్ మోహన్, జి.క్రాంతి కుమార్, ఐ.ఆంజనేయులు, సీహెచ్. శ్రీధర్ ఎన్నికయ్యారు. సభ్యుల పేర్లు ప్రకటించారు. అధ్యక్షులు కంచర్ల భార్గవ, కార్యదర్శి లంక గోవిందరాజులు.

ఏపీలో జలజీవన్ మిషన్ అమలు బాగోలేదు
కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అసంతృప్తి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జలజీవన్ పథకం అమల్లో ఏపీ ప్రభుత్వ పనితీరు బాగోలేదని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజ్యసభలో సోమవారం ఎంపీ జీవీఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కూడా ఏపీ వాడుకోలేకపోయిందని తెలిపారు. 2021 నుంచి పథకం నిధులను ఏపీ ప్రభుత్వం సక్రమంగా వినియోగించుకోలేక పోయిందన్నారు. దశల వారీగానే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని కేంద్ర జలశక్తి తేల్చి చెప్పింది. టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలమంత్రిత్వ శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. 41.15 మీటర్ల వరకు నీటి నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం చేపట్టాలనుకున్న రాష్ట్ర ప్రభుత్వం, మొదటి దశలో మిగిలిన పనులు పూర్తి చేసేందుకు రూ. 17,144.06 కోట్లు అవసరమని ప్రతిపాదించింది. మొదటి దశలో మిగిలిన పని పూర్తయ్యేందుకు అయ్యే అదనపు ఖర్చును భరించేందుకు కేంద్రం రూ. 10,911.15 కోట్లు, మరో రూ. 2వేలకోట్లు వరదలు కారణంగా జరిగిన నష్టం కింద చెల్లించేందుకు కేంద్ర ఆర్థిక శాఖ అంగీకరించిదని, సదరు ప్రతిపాదనలను కేంద్ర కేబినెట్ ఆమోదించాల్సి వుందని తెలిపింది.

సిబ్బంది ఇబ్బందుల్ని చక్కదిద్దండి

ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్

విశాలాంధ్రబ్యూరో- అమరావతి: క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా చేపట్టిన కేడర్ బలోపేతం వల్ల ఉత్పన్నమవుతున్న గందరగోళ పరిస్థితుల్ని, సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందిక పరిస్థితిని చక్కదిద్దాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణ విభాగం (ఏపీ పీటీడీ)-ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో ఎండీ సీహెచ్.తిరుమలరావు, ఈడీ బ్రహ్మానందరెడ్డి అధ్వర్యంలో సోమవారం యూనియన్ల నేతలతో సమావేశం నిర్వహించారు. ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య మాట్లాడుతూ ప్రధాన కేడర్‌ను బలోపేతం చేసి, సిబ్బందిని కుదింపు చేశారన్నారు. దీంతో ఉద్యోగులపై పనిభారం పెరుగుతోందని, కేడర్ బలోపేతం పేరుతో పీటీడీ సిబ్బందిని వివిధ ప్రాంతాలకు బదిలీలు చేయడంతో హెచ్‌ఆర్‌ఏ తగ్గుతోందన్నారు. ఏ ఉద్యోగినైనా కేడర్ బలోపేతంలో భాగంగా ఎక్కడా చూపించినప్పటికీ, పనిచేసిన చోట ఉండే ప్రయోజనాలు, హెచ్‌ఆర్‌ఏ వచ్చేలా చూడాలని కోరారు. ఆస్పత్రి వైద్య సౌకర్యాలు, ఇంక్రిమెంట్లు, అరియర్లు, రుణాలు తదితర సౌకర్యాలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. 2011 విధానాలకు అనుగుణంగా ఖాళీలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆర్టీసీ ఎండీ మాట్లాడుతూ త్వరలో డ్రైవర్ల భర్తీ కోసం ప్రభుత్వ అనుమతి కోరతామన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎన్‌ఎంయూ నాయకులు వై.శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకులు పి.సుబ్రహ్మణ్యంరాజు, కే.నాగేశ్వరరావు, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

అమరావతిలో ఆరునెలల్లో ఇళ్ల నిర్మాణం

పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రాజధాని పరిధిలో ఇళ్లే కాదు... ఊళ్లు నిర్మిస్తామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ స్పష్టం చేశారు. మరో ఆరు నెలల్లో పూర్తి మౌలిక సౌకర్యాలతో పేదల ఇళ్ల నిర్మాణ ప్రక్రియను పూర్తి చేసి చూపిస్తామన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి సురేశ్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో బడుగులకు భూమి ఇవ్వలేదుగానీ, సింగపూర్ కంపెనీకి కట్టబెట్టారంటూ గుర్తుచేశారు. రాజధానిలో పేదల ఇళ్లంటే సామాజిక అసమతుల్యత అన్నారని, వారి ఇళ్లను అడ్డుకునేందుకుగాను ధర్నాలు, కోర్టుల్లో కేసులతో అడ్డంకులు సృష్టించారని మండిపడ్డారు. సీఎం జగన్ సంకల్పం ముందు వారి కుట్రలు నిలవలేదని, అన్నిటికీ దీటుగా పండుగలా ఇళ్లకు శంకుస్థాపన చేశామన్నారు. ఆగస్టు నెలాఖరుకి మరో లక్ష టిడ్కో ఇళ్లు పూర్తి చేస్తామని వివరించారు. పవన్ కల్యాణ్ సినిమాల్లో హీరో, రాజకీయాల్లో హాస్యనటుడని చమత్కరించారు. ఒక సిద్ధాంతమంటూ లేని పార్టీ జనసేన అని, చంద్రబాబు చెప్పినట్లు ఆడటానికే పవన్ పరిమితమయ్యారంటూ ఎద్దేవా చేశారు. రాజధానిలో పేదల ఇళ్ల నిర్మాణ ప్రక్రియలో భాగంగా కేవలం ఐదు రోజుల్లోనే షియర్ టెక్నాలజీతో నిర్మించిన ఇంటిని మొదటి లబ్ధిదారునికి సీఎం జగన్ అందించారన్నారు. ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు పడుతున్న అడుగులు ప్రజలంతా గమనించాలని, మరో ఆరు నెలల్లో రాజధాని ప్రాంతంలో పూర్తి మౌలిక వసతులతో కొత్త గ్రామాలు రాబోతున్నాయని నొక్కి చెప్పారు. రాష్ట్ర ప్రజలంతా మా నమ్మకం, మా భవిష్యత్తు నువ్వే జగన్ అంటూ గొంతెత్తి చాటుతున్నారని మంత్రి ఆదిమూలపు చెప్పారు.

వర్షాల వేళ... వజ్రాల వేట
రాయలసీమకు ప్రజల పరుగు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ఒక్క వజ్రం లభిస్తే తమ జీవితమే మారిపోతుందనే ఆశ వారిది...రాయలసీమలోని కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి, మద్దికెర మండలాల్లో యేటా వజ్రాన్వేషణ జరగడం ఆనవాయితీ. రాయలసీమను రతనాల సీమ అంటారు. శ్రీకృష్ణదేవరాయల పాలనలో రతనాలను రాసులుగా పోసి విక్రయించారని చెబుతారు. అందుకే రాయలసీమలో వర్షం పడితే పొలాల్లో వజ్రాలు లభించడం కొన్నేళ్లుగా చూస్తున్నాం. ముఖ్యంగా తుగ్గలి మండలం జొన్నగిరి, పగిడిరాయి, ఎర్రగుడి, ఉప్పర్లపల్లి, తుగ్గలి, మద్దికెర మండలం పెరవళి, మదనంతపురం, బసినేపల్లి తదితర ప్రాంతాలలో వజ్రాలు లభిస్తాయి. ఈ వజ్రాన్వేషణకు గుంటూరు, కృష్ణా, అనంతపురం, ప్రకాశం జిల్లాల నుండి, తెలంగాణలోని మహబూబ్ నగర్, గద్వాల, కర్నాటక రాష్ట్రం బళ్లారి నుండి పెద్దఎత్తున ఆశావహులు రైలులో, ద్విచక్ర వాహనాలు, ఆటోల ద్వారా వస్తారు. తుగ్గలి, మద్దికెరతోపాటు కర్నూలు, కోడుమూరు, డోన్, పత్తికొండ, ఆదోని ప్రాంతాల నుంచి సద్ది కట్టుకొని మరీ వస్తారు. కొంతమంది వజ్రాల కోసం ఆయా గ్రామాల్లోని గ్రామచావిడి, దేవాలయాలు తదితర ప్రాంతాల్లో కొన్ని రోజుల పాటు నివాసం ఉంటారు. అదృష్టం పండి వజ్రం లభిస్తే వారి సంతోషానికి హద్దులు ఉండవు. అయితే, వజ్రం దొరికితే ఇక్కడి వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి బహిరంగ వేలం పేరుతో తక్కువ ఖరీదుకు కొనుగోలు చేయడం ఆనవాయితీ. వజ్రం లభించిన వారు కచ్చితంగా అక్కడి వ్యాపారులకే విక్రయించాలి. లేకపోతే భయభ్రాంతులకు గురిచేస్తారు. ఎంత ఖరీదు వజ్రమైనా స్థానిక వ్యాపారస్తులు బహిరంగ వేలం ద్వారా కొనుగోలు చేస్తామని చెబుతారు. వజ్రం లభించిన వ్యక్తికి దాని అసలు ఖరీదులో 50 శాతం మించి ఇవ్వరు. డబ్బుతోపాటు చిన్నచిన్న బంగారు ఆభరణాలు ఇచ్చి సంతృప్తి పరుస్తారు. ఇటీవల ఒక మహిళకు 14 లక్షల వజ్రం లభించినట్లు తెలుస్తోంది. వర్షాకాలం వచ్చిందంటే రోజూ వజ్రాల కోసం అన్వేషణ కొనసాగుతుంది. కనీసం చిన్న చిన్న వజ్రాలైనా లభిస్తాయని ప్రజల విశ్వా సం. కాగా, వజ్రాల కోసం వచ్చే వారు తమ పంటపొలాలు నాశనం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తొలకరి సమయంలో వచ్చి వెతికితే పరవాలేదని, విత్తనం వేసిన తరువాత పొలాల్లో తిరగడం వలన మొక్కలు విరిగిపోతున్నాయని రైతులు బాధపడుతున్నారు. దీంతో పంటలు వేసిన పొలాల్లో వజ్రాల కోసం వెతకవద్దరి గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు.

కడపలో

మచిలీపట్నంలో

విజయనగరంలో

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి

సీపీఐ అధ్వర్యంలో నిరసనలు

విశాలాంధ్ర-కడపరూరల్/మచిలీపట్నం/విజయనగరం టౌన్: మణిపూర్‌లో మహిళల మాన, ప్రాణాలకు రక్షణ కల్పించలేని మోదీ, అమిత్‌షా రాజీనామా చేయాలని సోమవారం రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో నిరసనలు జరిగాయి. కడపలో అఖిలపక్ష పార్టీలు, మహిళా సంఘాల అధ్వర్యంలో బాబు బాయ్ నేతృత్వంలో సాగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, తెలుగుదేశం నాయకులు అమీర్‌బాబు, వైసీపీ అహ్మద్ బాషా, సీపీఎం నాయకులు రామ్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సత్తార్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకులు బషీరున్నిసా, ఆర్‌సీపీ మహిళా సమాఖ్య నాయకులు తస్లీమా, మహిళా నేతలు పర్వీన్‌లు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికైనా మౌనం వీడాలన్నారు. ఇప్పటికైనా మణిపూర్‌లో శాంతియుత పరిస్థితులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకట శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, నగర కన్వీనర్ మైనుద్దీన్, వైయస్సార్సీపి నాయకులు సుబాన్ బాషా, షఫీ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో

పచ్చని భారతదేశాన్ని కులమతాల చిచ్చులతో విడదీయాలని చూస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ కృష్ణాజిల్లా సీనియర్ నాయకులు మోదుమూడి రామారావు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా సీపీఐ మచిలీపట్నం నియోజకవర్గం సమితి ఆధ్వర్యంలో సోమవారం స్టార్ కాలేజీ విద్యార్థిని విద్యార్థులతో ర్యాలీ చేస్తూ లక్ష్మీటాకీస్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మతతత్వ పార్టీ రాజ్యమేలుతుందని, అన్నదమ్ములవలే నివసిస్తున్న వారి మధ్య చిచ్చుపెట్టి వేడుక చూస్తోందన్నారు. ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలకు బీజేపీ ప్రభుత్వం కచ్చితంగా సమాధానం చెప్పాలన్నారు. సర్పంచి గల్లా తిమోతి మాట్లాడుతూ కొన్ని రోజులుగా మణిపూర్ రాష్ట్రం తగలడిపోతోందనీ, దీనిపై ప్రధాని మాట్లాడకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యర్రంశెట్టి ఈశ్వరరావు, కే గగన్, మహిళా సమాఖ్య నాయకులు మోదుమూడి అరుణకుమారి, మైలా పద్మజ, ఆర్. బేబి కుమారి, ఎం. నాగరాజు, నాగేశ్వరరావు, సాయి, చక్రి, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విజయనగరంలో నల్లరిబ్బన్లతో నిరసన

మణిపూర్ లో మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యంత క్రూరంగా అత్యాచారానికి పాల్పడిన మతోన్మాద మృగాలను కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం విజయనగరం అంబేద్కర్ జంక్షన్ వద్ద ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు మద్ది మాణిక్యం, ప్రధాన కార్యదర్శి బుగత పావని, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగభూషణం మాట్లాడుతూ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ బీబీ , అధ్యక్షులు బాయి రమణమ్మ , ఉపాధ్యక్షులు ఉంగరాల జయలక్ష్మి, గౌరీ, ఖాదర్ బీబీ, ఎల్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ట్విట్టర్‌లో పార్లమెంటు సమావేశాలు

మూడురోజులకింద ప్రారంభమైన పార్లమెంటు సమావేశం మూడో రోజూ ఎలాంటి కార్యకలాపాలు లేకుండా వాయిదా పడింది. గురువారం ప్రారంభమైన సమావేశాలూ ఏ రోజూ జరగనే లేదు. మణిపూర్ పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటన చేయాలన్న ప్రతిపక్షాల అభ్యర్థనను అధికారపక్షం ససేమిరా అంగీకరించడం లేదు. చర్చంటూ జరిగితే కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమాధానం ఇస్తారని అధికార పక్షం అంటోంది. నరేంద్ర మోదీ ఇంత బెట్టు చేయడానికి కారణం అంతుపట్టదు. జరగవలసిన కార్యకలాపాలైతే స్తంభించాయి కానీ సభలో గలభా సృష్టించారన్న ఆరోపణపై ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యుడు సంజయ్ సింగ్‌ను రాజ్యసభ అధ్యక్షుడు జగదీప్ ధన్‌కర్ ఈ సమావేశాలు ముగిసే దాకా సస్పెండ్ చేశారు. ఏదో ఒక అదును చూసుకుని అధికార పక్షం కొన్ని బిల్లులను ఉపసంహరించుకుంది. పార్లమెంటు సమావేశాలు జరగకపోవడానికి మీరు కారణం అంటే కాదు మీరే కారణం అని ట్విట్టర్‌లో మాత్రం వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. అంటే పార్లమెంటు సమావేశాలు ట్విట్టర్ కు పరిమితమై పోయాయనుకోవాలి. తమ పార్టీ నాయకుడు సంజయ్ సింగ్‌ను సస్పెండు చేయడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించడమేనని, ఢిల్లీ ప్రభుత్వంలో మంత్రి, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చెడ్డా అంటున్నారు. మణిపూర్ పరిస్థితిపై ప్రధానమంత్రి స్పందించాలని ప్రతిపక్షాలు కోరుతూ ఉంటే రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ ఉదంతాల మీద కూడా చర్చ జరగాలని కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ వాదిస్తున్నారు. ఇది అసలు సమస్యను అటకెక్కించి కుటిల రాజకీయాలకు పాల్పడడమే. ప్రధానమంత్రి మోదీ హయాంలో ఈశాన్య రాష్ట్రాలలో సానుకూల మార్పు వచ్చిందని, ఆ ఏడు రాష్ట్రాలూ మిగతా భారత్ తో సమీకృతం అయి పోయాయని మోదీ భక్తులు అలసట లేకుండా వాదిస్తూనే ఉన్నారు. నిజానికి ఈశాన్య ప్రాంతం ప్రస్తుతం అల్ల కల్లోలంగా ఉంది. ఈశాన్య రాష్ట్రాలలో పర్యటించినప్పుడు మోదీ ధరించిన రంగురంగుల టోపీలకు కొదవలేదు. మండిపోతున్న మణిపూర్ లో పర్యటించే సాహసం మాత్రం ఆయన చేయడం లేదు. అమిత్ షా ఆ రాష్ట్రంలో పర్యటించిన మాట వాస్తవమే కానీ ఆయన ప్రజలను కలుసుకున్నదీ లేదు. వారికి సాంత్వన కలిగించిందీ లేదు. అధికారులతో జరిగిన సమావేశాల్లో హితవచనాలు పలకడానికే అమిత్ షా పర్యటన పరిమితం అయింది. మోదీ ప్రపంచ నాయకుడని సొంత బాకా ఊదడానికి ఆయన భక్తులు ఎప్పుడూ వెనకాడరు. ఆయన రష్యా-ఉక్రెయిన్ సమస్య పరిష్కరించడానికి ఎంత కృషి చేశారో చెప్పడానికి ఆ భక్తులు తంటాలు పడుతూ ఉంటారు. బెంగాల్ లోనూ మహిళలను వివస్త్రలను చేసి నగ్నంగా ఊరేగించిన అంశాన్ని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రస్తావించనప్పుడు మణిపూర్ మారణకాండ గురించి మోదీ పట్టించుకోకపోతేనేం అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ లో జరిగిన ఇలాంటి సంఘటనలను పదే పదే ప్రస్తావించి మణిపూర్ మీంచి జనం దృష్టిని మళ్లించి ఆ రెండు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ను బోనులో నిలబెట్టడానికి నానా యాతనా పడ్తున్నారు. రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ లో జరిగిన దారుణాలను ఎవరూ సమర్థించడం లేదు.

ప్రతిపక్షాల్లు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో జరుగుతున్న అఘాయిత్యాలు మణిపూర్ మారణకాండను చాప కిందకు తోసేయలేవు. మణిపూర్ పరిణామాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తనంత తాను ప్రస్తావించి ప్రభుత్వం ఏమీ చేయకపోతే వారం రోజుల్లోగా మేమే ఏదో ఒకటి చేస్తామని ప్రకటించడం మోదీని ఇరకాటంలో పెట్టినా ఆయన మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శించడం మానలేదు. ప్రధాన న్యాయమూర్తి తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు కనక ప్రధాని రాజీనామా చేయాలని వాదించేవారూ ఉన్నారు. 140 మంది మణిపూర్ మారణకాండలో మరణించినా ప్రార్లమెంటులో నిలబడి సమాధానం చెప్పే ఉద్దేశం మోదీకి లేదు. పార్లమెంటు సభ్యులు ఈ విషయం గురించి ఏం చేస్తారు అని మోదీ అనుకుంటున్నట్టున్నారు. మోదీ ప్రభుత్వ వైఫల్యం ఒక్క మణిపూర్‌కే పరిమితం కాలేదు. తాము అధికారంలోకి వస్తే కశ్మీరీ పండితులు వాళ్ల స్వగృహాలకు వెళ్లే ఏర్పాటు చేస్తాం అని 2014 ఎన్నికలకు ముందు బీజేపీ బీరాలు పలికింది. ఈఇ హామీ ఏ మాత్రం నెరవేరలేదు. కశ్మీరీ పండితులు ఇప్పటికీ శరణార్థుల శిబిరాల్లోనే మగ్గుతున్నారు. కశ్మీర్‌లో కనిపించిన సంపూర్ణ వైఫల్యమే మణిపూర్‌లో మరింత విస్తృతంగా ద్యోతకం అవుతోంది. మోదీ క్రియా రాహిత్యంవల్ల మణిపూర్ లో మెయితీలకు ఇతర వర్గాలకు మధ్య విభేదాలు మరింత తీవ్రమైనాయి.

లోకం దృష్టిలో మెయితీలు అపరాధులుగా మిగిలి పోయారు. వారు మణిపూర్ లోనే కాక మిజోరంలో కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. మెయితీలు హిందువులే కావచ్చు. కానీ అక్కడ గణనీయమైన సంఖ్యలో క్రైస్తవులు, ముస్లింలు కూడా ఉన్నారు. మోదీ ప్రభుత్వ నిర్వాకం వీరి మధ్య విభేదాలను శాశ్వతం చేసే ప్రమాదం ఉంది. సకల రాజ్యాంగ వ్యవస్థలనూ మోదీ హయాంలో ధ్వంసం చేస్తూ ఉంటే సుప్రీంకోర్టు మాత్రం ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని భావిస్తోంది. కానీ ఒక్క న్యాయ వ్యవస్థ మాత్రమే సర్వస్వం కాదు. ప్రజాస్వామ్యాన్ని పదిలంగా కాపాడడానికి పార్లమెంటు సవ్యంగా పని చేయాలి. రోజుల తరబడి పార్లమెంటు స్తంభించడం వల్ల ఆ అవకాశం ఉండడం లేదు. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పేరుకే తప్ప ఆచరణలో లేదు. మన ప్రజాస్వామ్య ఘనత ఊహాలోకాలకే పరిమితమైంది. ఏకచ్ఛత్రాధిపత్యమే ప్రజాస్వామ్యం అని భ్రమింపచేసే పాలన కొనసాగుతోంది. పార్లమెంటుకు జవాబు దారు కాని ఏ ప్రభుత్వమూ ప్రజాస్వామ్య వ్యవస్థ అని చెప్పుకోవడానికి వీలు లేదు. 2జి కుంభకోణం జరిగినప్పుడు అపారమైన పార్లమెంటరీ అనుభవం కలిగిన బీజేపీ సీనియర్ నాయకురాలు సుష్మా స్వరాజ్ పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కాక ముందే స్తంభింప చేస్తాం అని ప్రకటించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి మాత్రమే పనికొస్తుంది. పార్లమెంటు సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్న సమయంలో దానికి కూడా అవకాశం లేకపోతే పార్లమెంటరీ వ్యవస్థలోని ఒక ప్రధానాంగం నిశ్చేష్టమైనట్టే. అయితే ప్రజాస్వామ్య సంప్రదాయాలను పరిరక్షించే ఆలోచనే లేని దశలో భవిష్యత్తు అంధకార బంధురంగానే ఉంటుంది. పార్లమెంటరీ సమావేశాలలో అధికార పక్షాన్ని నిలదీసే హక్కు ప్రతిపక్షాలకు ఉంది. ప్రత్యర్థి పక్షం అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకునే వ్యవస్థే అసలైన ప్రజాస్వామ్యం. కానీ ఈ లక్షణం ప్రస్తుత అధికార పక్షంలో కలికానికిక్కూడా కనిపించడం లేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను బయటికి చెప్పకుండానే అధ్యక్ష తరహా ప్రభుత్వంగా మార్చేసే ఉద్దేశం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఇది వినాశకరం.

యాత్రా స్పెషల్

చింతపట్ల సుదర్శన్

ఆకాశంలో నల్లమబ్బులు ఒక దానితో ఒకటి కుస్తీ పడుతున్నాయి. రూపాయి బిళ్లలు భూమ్మీద చిల్లులు పొడుస్తున్నాయి. నీటి కొరడాల చప్పుడు ఆగకుండా వినిపిస్తున్నది. అప్పుడప్పుడు మెరుపు ఒకటి తను అక్కడ ఉన్నానని కనిపించిపోతున్నది. ఛస్తార్రా పక్కకు తప్పుకోండి అంటూ క్రిందపడటానికి ముందు 'హెచ్చరిక' చేస్తున్నాయి పిడుగులు. ఇలా ఇంటర్వెల్ లేకుండా కురుస్తుంటే రోడ్డు ఎక్కడానికిలేదు. ఆకలికి ఆ సంగతి తెలీక 'ఆగం'చేస్తున్నది అంది డాగీ. డ్రమ్ములాంటిపొట్ట ఖాళీగా ఉండటంతో ప్రేవులు అరిచి గీపెడ్తున్నవి అంది డాంకీ. కూలిన కొంపలో ఉన్నాం కనక కొంపకూలుతుందన్న భయంలేదు కానీ కూలే కొంపల్లో, కాలే కడుపుల్తో మనుషులుపాపం ఎలాఉన్నారో అని డాంకీ అంటే వాళ్లకేంలే ఏలే వారున్నారు. హెలికాప్టర్లనుంచి అన్నం పొట్లాలు విసిరెయ్యకపోరు. ఓట్లు వేసేవారు అవెయ్యడానికి చచ్చినట్టు బ్రతికుండాలి కదా. వానలుపడి రోడ్లు కొట్టుకుపోయి ఇళ్లుకూలి జనంభోరున ఏడుస్తుంటేనేకదా వారికి సేవ చేసుకునే లక్కీఛాన్సు దొరుకుతుంది లీడర్లకు అటూ లేచి నిలబడింది డాగీ.

రంగస్థలం

ఓ మనిషి ఆదారంట వస్తున్నాడు. ఓ చేతిలో గొడుగుంది మరో చేతిలో ఏదోకవరుంది. అరుగుమీది నుంచి కిందకి 'జంపు' చేసి ఆ మనిషి చేతిలో ఉన్న కవరును అందుకుని అరుగెక్కింది డాగీ. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది. కుక్క తన పిక్క పట్టుకోనందుకు సంతోషిస్తూ, కవరు పోయినందుకు చింతిస్తూ పరుగు తీశాడు మనిషి. ఏమిటి నువ్వు చేసిన పని తప్పుకదా అంది కోప్పడుతూ డాంకీ. మనం ఎవరైనా దయతలిచి పెడితే తింటాం కానీ బలవంతంగా లాక్కొని మనుషుల్లా నీతి తప్పి బతకం. కానీ ప్రాణ విత్త మానభంగమని ఏదో అంటారే తప్పనిసరై తప్పే చేశాను. చూడు ఈ కవర్‌లో బ్రెడ్డుంది దీనితో ఈ రోజు గడుస్తుంది. నీకు డబుల్ ధమాకా బ్రెడ్డుతో పాటు కవరూ ఆదుకుంటుంది అని డాగీ అంటుంటే అబ్బాయి కనిపించాడు. ఓటు వేశాక ఓటర్ని ఎవర్రా నువ్వు అని అరిచే నాయకుడిలా ఇల్లు దాటిపోతున్నావేం 'అన్నా' అంది డాగీ.

వాన తగ్గింది కాని మళ్లీ ఏ క్షణాన్నయినా రావచ్చునని వెళ్లన్నా. సరే కాసేపు ఉండిపోతాలే అంటూ ఆరుగు ఎక్కాడబ్బాయి. 'వాన రాకడ, పదవి పోకడ' ఎవరూహించగలరు కాని అల్పపీడనాలూ, వాయుగుండాలూ, పాదయాత్రలు చేసేవాళ్ల పాలిట ప్రతిపక్షాలవుతున్నాయి. ఇన్ని మైళ్లు నడిస్తే అన్ని ఓట్లు పడతాయనే సెంటిమెంటు పాదయాత్రయింది అంది డాంకీ. పాదయాత్రలు చేస్తూ చెవులు పిండుతున్నారు. నిన్న ఒక యువకిశోరం ఇరవై లక్షల ఉద్యోగాలిస్తామన్నాడు అన్నాడబ్బాయి. ఇంకేం నువ్వు ఓ ఉద్యోగివీ ఓ ఇంటోడివీ అయిపోవచ్చు. ఆ తర్వాత మీ ఆవిడకి వచ్చే అమ్మ ఒడితో పిల్లల్ని బడికి పంపవచ్చు అంది డాంకీ. ఇరవై లక్షల మందిలో మనోడుండాలిగా అంది డాగీ. ఉద్యోగంరాకపోతే నిరుద్యోగభృతి ఇస్తానన్నాడుగదా అంది డాంకీ. శుష్కప్రియాలు శూన్యహస్తాలు అనంటారు. మాటల సంతర్పణ ఎన్నికయ్యేదాకే. ఆ తర్వాత ఉద్యోగాలు అటకెక్కును. నిరుద్యోగభృతి హుష్‌కాకవును మసిపూసింది మారేడు కాయని అర్థంచేసుకోలేని వారెవరూ లేరిక్కడ అన్నాడబ్బాయి. అసలీ యాత్రా కథనం ఏమిటో 'ఫుట్ వాకింగ్' ట్రెండ్ 'ట్రెండీ' ఎందుకయిందో అంది డాగీ. ఒకప్పుడివి ప్రజలకు మేలు చేసినవే. ఉప్పు సత్యాగ్రహంలో మొదలైనవీ యాత్రలు. ఒకాయన భూదానం కోసం కాళ్లు అరిగేట్టు చెప్పు ల్లేకుండా తిరిగాడు. ఆ సందర్భాలు వేరు అవి ఓట్లు దోచుకోవడానికి కాదు అన్నాడు అబ్బాయి.

అవునవును. గుర్తొస్తున్నది. స్వతంత్రదేశంలో ఒక పెద్దాయన రతయాత్ర. ఆయన రథయాత్ర చేసి 'మతదానం' చేశాడు. ఒకాయన చైతన్య రథయాత్రసాగించి దారంట గడ్డం గీక్కుని, మరొకాయన పాదాలకు బలపాలు కట్టుకు తిరిగి అనుకున్నది సాధించారు కదా. ఇక పాదయాత్రల పరంపర 'పరంపరై' కూచుంది అంది డాంకీ. అవును సుమా! ఒక వనిత, పాదయాత్రతో ముప్పయి మూడేళ్ల! 'లెఫ్ట్ ఫ్రంట్' అధికారానికి చెక్ పెట్టింది. కోవిడ్‌ను తరిమి కొట్టడానికి చప్పట్లూ, పళ్లాల మీద గరిటెల గంటలూ ఉపయోగపడకపోవడంతో ఓ పార్టీ వారు జన ఆశీర్వాదయాత్ర సాగించారు అన్నాడు అబ్బాయి.

వెనుకట, సంతానంలేని రాజులు 'సంతు' కోసం తీర్థయాత్రలు చేసినట్లు ఇప్పుడు మనవాళ్లు కాళ్లకు బుద్ధిచెప్తున్నారు. జనం సభలకు రావడంలేదని, వాళ్లను లారీల్లో ఎక్కించడానికి బోలెడు డబ్బు ఖర్చవుతున్నదని ప్రజల వద్దకే పాలకులు సత్తుపళ్లెం పట్టుకు వస్తున్నారు. ఎక్కడ చిక్కిన జనానికి అక్కడే మాటల పంచదార పెడ్తున్నారు. అంది డాగీ.

భారత్‌యాత్ర, గుజరాత్ గౌరవ్ యాత్ర, మురుగన్ వేలాయుధం యాత్ర, నర్మదా పరిశ్రమ యాత్ర ఎన్నెన్ని యాత్రలో. యాత్రికులను రాజుల్ని చెయ్యడానికే రాజదండం అందించడానికే కొన్ని 'యాత్రా స్పెషల్స్' అన్నాడు అబ్బాయి. వయసుమీరిన బ్రహ్మచారి ఒక సంచారి అదేదో జోడోయాత్ర కన్యాకుమారి నుంచి శ్రీనగర్ దాకా సాగదీశాడు కదా. అయినా ప్రజలు ఆయన్ని వాళ్ల ఫ్యామిలీ కుర్చీకి జోడిస్తారో లేదో అన్నది డాంకీ. ప్రజాసమస్యల్ని పట్టించుకోరు. ప్రజలకోసం ఉద్యమించరు. నిమ్మకు నీరెత్తినట్టుండి అల్లా ఉద్దీన్ అద్భుతదీపం చేత్తో పట్టుకు తిరిగేదో పాదయాత్రన్నమాట అన్నాడు అబ్బాయి.

అన్నా మళ్లీ వర్షం వచ్చేట్టుంది. బయల్దేరు. పాదయాత్రచేస్తూ ఇంటికి వెళ్లడం కష్టమవుతుందేమో అంది డాగీ!

చల్లారని మణిపూర్ మంటలు


కూనంనేని సాంబశివరావు

ఏరోజైతే అర్ధరాత్రి సమయంలో మహిళలు నిర్భీతితో సంచరించగలరో ఆరోజే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం అని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. గిరిజన మహిళ ద్రౌపది ముర్ము నేడు దేశాధ్యక్షురాలుగా ఉన్నారు. మణిపూర్‌లో ముగ్గురు గిరిజన మహిళలను వివస్త్రలనుచేసి నడిరోడ్డులో ఊరేగించి ప్రపంచం నివ్వెరపరిచింది. ఒక మహిళ భర్త, తనయుడుని హత్యచేసి, ఇరువురి మహిళలను సామూహికంగా మానభంగం చేసిన ఘటన మెజారిటీ వర్గీయుల ఓట్లు, సీట్లు కొరకు ఏ స్థాయికైనా దిగజారేటువంటి ఏ నాయకుడైనా, ఏ రాజకీయ పార్టీ అయిన గుండె లోతుల్లోనుంచి మానవదృక్కోణంలో పరిశీలన చేయవల్సి వుంటుంది. ఈ నేపథ్యంలో దేశంలో గత కొన్ని సంవత్సరాలుగా బాపూజి కన్న కలలను వమ్ము చేసేవిధంగా పట్టపగలు సైతం దేశంలో మహిళలపై అత్యాచార ఘటనలు నిరాఘాటంగా కొనసాగుతున్నాయి.

గుజరాత్‌లోని బిల్కిస్ బానో కుటుంబ సభ్యులు ఏడుగురిని హత్యచేసి పట్టపగలే బిల్కిస్ బానోను మానభంగం చేసిన క్రూరులను న్యాయదేవత తీర్పును సైతం ధిక్కరించి విడుదలచేసి రాచమర్యాదలతో బీజేపీ నాయకులు స్వాగతం పలికిన సన్నివేశాన్ని మరువగలమా? దేశ పతాకాన్ని ప్రపంచంలో సమున్నతంగా ఎగురవేసిన మహిళామల్లయోధులను సెక్సుపరమైన వేధింపులకు గురిచేసిన బీజేపీ ఎం.పీ. బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై బీజేపీ పాలనలో ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయడానికే నెలలుపట్టింది. మెజారిటీ మతం పేరుతో సామాజిక ఉద్యమకారులు, అభ్యుదయవాదులైన గోవింద్ పన్సారే, దభోల్కర్, కల్బుర్గి, గౌరి లంకేశ్వర్ లాంటి వారిని ఒకే తరహాలో హత్యచేసిన వారిపైన చర్యలుఉండవు. ఈ విధంగా దేశంలో ఏ రోజుచూసినా, ఏ మూల చూసినా అత్యాచారాలు, హత్యలు చేస్తున్నవారు అధికారం అండవుంటే జబ్బ చరిచి, రొమ్మువిరిచి బజారులలో విజృంభిస్తూ తిరుగుతుంటే మణిపూర్ లాంటి ఘటనలకు పాల్పడిన మానవమృగాలకు భయంమెందుకుంటుంది. సాక్షాత్తు సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని "మీకు చేతకాకపోతే మేమే చర్య తీసుకుంటాం" అనే హెచ్చరిక ఇచ్చేవరకు నోరువిప్పని, కండ్లున్న, మనస్సు లేని ప్రధానిగా మన ప్రధాని చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. మణిపూర్ రాష్ట్రంలోని మెజారిటీ వర్గమైన మెయితీ జాతికి చెందిన బీరెన్ సింగ్, తమ తుచ్ఛ రాజకీయ ఓట్ల క్రీడ దుర్నీతిలో ప్రపంచం ముందు దోషిగా నిలబడ్డాడు..

మోదీ మౌనం...జోక్యానికి అమెరికా అత్యుత్సాహం.

విశ్వగురువుగా బీజేపీ ప్రచారంచేసే ప్రధాని మోదీ మౌనవ్రతం వల్ల, మణిపూర్‌లో శాంతికోసం తాను సహకరిస్తానని ప్రతిపాదించేవరకు అమెరికా తెగపడటం దేశ ప్రతిష్ఠకే అవమానం. అలాగే యూరోపియన్ పార్లమెంటు సైతం మణిపూర్‌లో సాధారణ పరిస్థితులను తీసుకురావాలని కోరుతూ తీర్మానం చేయడం కేంద్రప్రభుత్వానికి సిగ్గుచేటు. ఇది ముమ్మాటికీ భారతదేశ అంతర్గత సమస్య అయినప్పటికీ, విదేశాలు జోక్యం చేసుకుంటామని

ప్రతిపాదించే దుస్సాహసం చేయడం, తీర్మానాలు చేస్తామనడం కేంద్ర ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనం.

గత రెండున్నర మాసాలుగా మణిపూర్ జాతుల సంఘర్షణలో రావణ కాష్ఠంగా మారినప్పటికీ అటు కేంద్రంలో, ఇటు ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఆ ఘర్షణలను తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ దుర్వినియోగం చేస్తున్నది. మణిపూర్‌లో మెయితీ, కుకీ, నాగా తదితర ప్రధాన తెగలు. వీటిలో 53 శాతం జనాభాతో లోయప్రాంతాలలో నివసిస్తున్న మెజారిటీ మెయితీలు హిందువులు కాగా, కొండ, పర్వత ప్రాంతాలలో నివసించే గిరిజన/ఆదివాసి కుకీ, నాగా తెగల వారు ఎస్‌టిలు, క్రైస్తవమతస్థులు. ఇటీవల మెయితీలను షెడ్యూల్డుకులాల(ఎస్‌టిల) జాబితాలో చేర్చాలనే హైకోర్టు తీర్పుతో అక్కడ జాతుల సంఘర్షణలు భగ్గుమన్నాయి. వాస్తవానికి అక్కడ ఘర్షణలకు భూమిక బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండే ఉన్నది. హైకోర్టు తీర్పు ఒక అవకాశంగా, సాకుగా మారింది. తమకు పట్టులేని ఈశాన్య రాష్ట్రాలలో ఎలాగైనా అధికారం సాధించాలనే లక్ష్యంతో బీజేపీ అనేక కుట్రలకు పాల్పడింది. జాతులు, తెగల మధ్య నెలకొన్న విబేధాలను తనకు అనుకూలంగా వాడుకోవడం, వేర్పాటువాద శక్తులతో కూడా చేతులు కలిపేందుకు తెగబడింది. ఇందులో భాగంగా కుకీలు బలంగా ఉండే పది స్థానాలలో తమకు మద్దతు ఇవ్వాల్సిందిగా బీజేపీ నేతలు రాం మాధవ్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మలు తమతో రహస్య ఒప్పందం కుదుర్చుకున్నారని కుకీలకు చెందిన నిషేధిత సాయుధదళ నేత ఒకరు ఇటీవల బహిర్గతం చేశారు. ఈ ఒప్పంద ఫలితంగానే కుకీలు అధికంగా ఉండే చోట బీజేపీ ఎంఎల్‌ఏలే ఎన్నికయ్యారు. అంతకుముందు కాంగ్రెస్‌కు మెజారిటీ ఎంఎల్‌ఏలు ఉన్నప్పటికీ, వారందరినీ అదిరించి బెదిరించి బీజేపీ మణిపూర్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కుకీలు నెమ్మదిగా తమకు ప్రత్యేక పరిపాలన మండలి కావాలనే నినాదాన్ని తెరపైకి తీసుకురాగా, సాక్షాత్తు బీజేపీ ఎంపినే ఈ డిమాండ్ చేశారు. ఇది మణిపూర్ సమగ్రతపై వివిధ అనుమానాలను అక్కడి ప్రజలకు రేకెత్తించింది. దీనికితోడు మణిపూర్ రాష్ట్రానికి 400 కిలోమీటర్ల మేరకు కీలకమైన విదేశీ సరిహద్దు ఉన్నది. ఆ రాష్ట్రానికి సరిహద్దుగా మైన్మార్ దేశం ఉండగా, కేవలం పది కిలోమీటర్లు మాత్రమే కంచె వేశారు. మిగతా సరిహద్దు నుండి సాయుధ వేర్పాటువాదులు, డ్రగ్స్ మాఫియా రాకపోకలు సాగుతుండడం గమనార్హం.

మణిపూర్ బీజేపీ ముఖ్యమంత్రి సహా మెజారిటీ ఎంఎల్‌ఏలు మెయితీలు కాగా, కుకీలు అధికంగా ఉండే పది స్థానాలలో కూడా బీజేపీ పాగా వేసింది. దీంతో రెండు జాతుల మధ్య ఘర్షణలు తీవ్రమైనప్పటికీ అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనంవహిస్తూ, రెండు చోట్ల అధికారంలో ఉన్న బీజేపీ రాజకీయ చలిమంటలు కాచుకుంటున్నది. తన సహజమైన విభజన లక్షణాన్ని బైటపెట్టి, కుకీలు, నాగాలపై దాడులకు పురికొల్పడం వెనక ఉండి బీజేపీ అగ్నికి ఆజ్యం పోసింది. ఇప్పటివరకు సుమారు 150 మంది ఘర్షణల్లో మరణించగా, 30 వేల మందికిపైగా నిరాశ్రయులయ్యారు. దీనికి పూర్తిగా డబుల్ ఇంజన్ సర్కార్‌లుగా ఉన్న బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే కారణం. ప్రజలు ఇంఫాల్, చూర్ చంద్రపూర్ క్యాంపులలో ప్రాణాలు అరచేతిలో పట్టుకొని బిక్కు బిక్కు మంటున్నారు. అక్కడ నిరంతర కర్ఫ్యూ, ఇంటర్నెట్ కట్‌తో జనజీవనం స్థంభించింది. శాంతిభద్రతలు దారుణంగా క్షీణించడానికి, జాతుల ఘర్షణ రోజురోజుకు పెరిగిపోవడానికి పూర్తిగా మణిపూర్ ముఖ్యమంత్రి బిరెన్ సింగ్ వైఫల్యమే కారణం.

మణిపూర్‌తో సీపీఐకి ప్రత్యేక బంధం

మణిపూర్ రాష్ట్రంతో సీపీఐ ప్రత్యేక అనుబంధం కలిగి ఉన్నది. అక్కడి రైతాంగ ఉద్యమాలతో ప్రజల గుండెల్లో నిలిచింది. కల్లోలిత సమయంలో 2007, 2012లో సంకీర్ణ ప్రభుత్వంలో కీలక పాత్రపోషిస్తూ మంత్రివర్గంలో సీపీఐ భాగస్వామిగా కొనసాగింది. కల్లోల సమయంలో మణిపూర్‌లో శాంతి పరిరక్షణకు కృషిచేసింది. మణిపూర్‌లో నేడు తలెత్తిన సంక్షోభ సమయంలో సీపీఐ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు పర్యటనలు చేస్తున్న వారిపై కుట్రకేసులను కూడా మోపారు. ఈ నేపథ్యంలో దేశంలోని యావత్ ప్రజానీకం మణిపూర్ ప్రజలకు అండగా ఉండటమే కాకుండా కేంద్రంలో, మణిపూర్ రాష్ట్రంలో నున్న బీజేపీ ప్రభుత్వాల మతోన్మాద విశృంఖలత్వానికి వ్యతిరేకంగా నిలబడి పోరాటం కొనసాగించి దేశాన్ని కాపాడుకోవడంలో అన్నివర్గాల ప్రజలు ముందుండాలని సీపీఐ పార్టీ పిలుపు జరిగింది. దేశ వ్యాపితంగా జూలై 25న మణిపూర్ ప్రజలకు సంఘీభావంగా ప్రదర్శన జరపాలని సీపీఐ జాతీయ సమితి పిలుపునిస్తున్నది.

(మణిపూర్ ప్రజలకు సంఘీభావంగా సీపీఐ ప్రదర్శనలు నేడు)

సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

అమెరికాలో పెరిగిన నల్లజాతి మాతృమరణాలు

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

"అమెరికాలో మాతృమరణాలు గత ఇరవైయేళ్లలో రెట్టింపయ్యాయి. అందులో నల్లజాతి మహిళల మరణాలు అత్యధికం." జులై3 న అమెరికన్ మెడికల్ అసోసియేషన్ పత్రికలో పరిశోధకుల ప్రచురణ. 1999-2019 మధ్య అమెరికాలోని 5 జాతుల, స్థానిక సమూహాల మాతృ మరణాలను పరిశీలించారు. 1999లో 505గా ఉన్న ఈ సంఖ్య 2019లో 1,210కి పెరిగింది.

అమెరికాలో నల్లజాతి మాతృమరణాలు ఎక్కువ. అమెరికన్, అలస్కా స్థానిక సమూహాల స్త్రీలది తర్వాతి స్థానం. "మాతృ మరణాల మూల కారణాలను తెలుసుకోవాలి. ఆరోగ్య జాగ్రత్తల అందుబాటు, వ్యవస్థీకృత జాతివివక్ష, ప్రభుత్వ ఆరోగ్య విధానాలు, అమలు తీరు వగైరా ప్రజారోగ్య స్థితిగతులను నిర్ణయిస్తాయి" అని మాతృమరణాల అధ్యయన బృంద సభ్యులు, వాషింగ్టన్ విశ్వవిద్యాలయ అనుబంధ ఆరోగ్య కొలమానాల, మూల్యాంకనాల సంస్థ 'మాస్ జనరల్ బ్రిఘం' వరిష్ఠ వైద్య నిర్దేశకులు డా.అలిసన్ బ్రియాంట్ వివరించారు. 2021లో అమెరికాలో మాతృమరణాల సూచీ (లక్ష జననాలలో మరణాలు) శ్వేతజాతి స్త్రీల (26.6) కంటే నల్లజాతి స్త్రీలలో (69.9) 2.6 రెట్లు ఎక్కువ. 2020 సూచీ కంటే 40శాతం అధికం. శ్వేతజాతి స్త్రీల కంటే నల్లజాతి స్త్రీలలో గుండె జబ్బులు 22శాతం, గర్భకోశ క్యాన్సర్ 71శాతం, కాన్పులమరణాలు 243శాతం ఎక్కువ. శ్వేతజాతి స్త్రీలకంటే నల్లజాతిస్త్రీలు 49శాతం ఎక్కువ అకాల కాన్పులకు గురవుతారు. వ్యవస్థీకృత మార్పుతో 80 శాతం కాన్పు చావులను ఆపచ్చు. కాన్పు తర్వాత 12వారాల వరకు తల్లులకు గుండెజబ్బు ప్రమాదం ఎక్కువ. 40శాతం నల్లజాతిస్త్రీలు డబ్బులేమితో కాన్పుతర్వాత ఆస్పత్రికి రారు.

గర్భధారణ సమయం, ప్రసవం తర్వాత ఏడాదిలోపు సంభవించే మహిళా మరణాలను మాతృ మరణాలుగా నిర్వచించారు. ధనిక దేశాల్లో అమెరికాలోనే మాతృమరణాలు ఎక్కువ. అధిక రక్తస్రావం, అంటు రోగాలు, గుండె జబ్బులు, స్వీయ హత్యలు, మితిమీరిన మత్తు పానీయాల, మాదక ద్రవ్యాల వాడకం మొదలగునవి ఈ మరణాల కారణాలు. మాస్ జనరల్ బ్రిఘం డాక్టర్ బ్రియాంట్, ఆమె సహచరులు మరణాలు, ప్రాణాలతోపుట్టిన శిశువుల (జీవజననాల) గణాంకాలను అధ్యయనం చేశారు. మాతృమరణాల అంచనాకు ప్రతి లక్ష జీవజననాలను నమూనాగా తీసుకున్నారు. ఈ అధ్యయనంలో బలమైన, విస్తృత అసమానతలను గుర్తించారు. అన్ని జాతులు, స్థానిక సమూహాలలో, దక్షిణ రాష్ట్రాలలో మాతృమరణాలు ఎక్కువ. నల్లజాతి స్త్రీలు, మధ్య పశ్చిమ రాష్ట్రాలు, పీఠభూమి ప్రాంతాల్లోని స్థానిక అమెరికన్, అలస్కా స్త్రీలలో ఈ చావులు ఇంకా ఎక్కువ. బహుళజాతులు, స్థానిక సమూహాలు ఎక్కువగా ఉన్న వ్యోమింగ్, మోంటాన ఇతర మధ్య పశ్చిమ రాష్ట్రాల్లో 2019 లో మాతృ మరణాలు ఎక్కువగా ఉన్నాయి. "మా పరిశోధన ఫలితాలు అసహ్యకరమైనవి. కాని ఆశ్చర్యకరమైనవి కాదు. మాతృమరణాలు పెరుగుతున్నాయనడానికి తగిన సాక్ష్యాధారాలున్నాయి. ఇది ఆందోళనకర స్థితి. వీటి కారణాలను, పరిష్కార మార్గాలను అన్వేషించాలి." అని వాషింగ్టన్ విశ్వవిద్యాలయ అనుబంధ సెయింట్ లూయిస్ వైద్య కళాశాల ఆరోగ్య సేవల, విధానాల పరిశోధకుడు డా.కారెన్ జాయంట్ మాడాక్స్ అన్నారు. సామాజిక సేవలు, ప్రాథమిక, మానసిక ఆరోగ్యాలపై ఇతర ధనిక దేశాల కంటే అమెరికా చాలా తక్కువ ఖర్చుపెడుతుంది.

నల్లజాతి స్త్రీల స్థితిగతులు చాలా కాలం నుండి అధ్వాన్నంగా ఉన్నాయి. అన్ని సామాజిక-ఆర్థిక నేపథ్య ప్రజలపైన ఈ సమస్య ప్రభావం చూపుతుంది. ఉదాహరణకు అమెరికా ఒలింపిక్ స్ప్రింటర్ విజేత 32 ఏళ్ల టోరి బోవి, మే 2023లో శిశుజనన సమస్యలతో కన్ను మూశారు. నల్లజాతి స్త్రీలు ప్రపంచ ప్రఖ్యాత టెన్నిస్ క్రీడాకారిణి సెరెనా విలియమ్స్, ప్రపంచస్థాయి గాయిని బియాన్స్ కూడా గర్భధారణ సమయంలో ప్రాణాంతక అపాయాలను ఎదుర్కొన్నారు. కోవిడ్ కూడా సామాజిక-ఆర్థిక వెనుకబాటు ప్రజలను ఎక్కువ బాధించింది. మాతృ మరణాలు తగ్గలేదని 2022 గణాంకాలు తెలుపుతున్నాయి. సమూహాల ఆధారంగా పరిష్కారాలపై దృష్టి కేంద్రీకరణకు, ఈ సమస్య పరిష్కారానికి వనరులను సేకరించడానికి ఈ వివక్షలను అర్థం చేసుకోవడం అతిముఖ్యం. అమెరికాలో వివిధ రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో,

మాతృమరణాలు నివారించడానికి వీలున్నవే.

అమెరికా మాతృమరణాల ప్రధానకారణమైన ప్రాణాంతక అధిక రక్తపోటును గుర్తించే ప్రిఎక్లంసియపరీక్షను అమెరికా ఆహారఔషధాల పరిపాలన విభాగం ఆమోదించింది. గర్భధారణ సమయంలో, శిశుజననం తర్వాత ప్రిఎక్లంసియ అనే రుగ్మత వస్తుంది. అమెరికా నల్లజాతి స్త్రీలకు ఈ రోగం ఎక్కువ అపాయం కలిగిస్తోంది. ఒలింపిక్ క్రీడాకారిణి టోరి బోవి ఈ రోగంతో మరణించారు. శిశుజనన భద్రతలో ఈ నూతన ప్రిఎక్లంసియ పరీక్ష ఘనవిజయంగా ప్రచారంపొందింది. "అమెరికా మాతృ ఆరోగ్యసమస్య జాతీయ విపత్తుగా మారింది. ఈ పరీక్ష సర్వరోగనివారిణి కాదు. తీవ్ర ప్రిఎక్లంసియ నుండి స్త్రీల ప్రాణాలను ఇది కాపాడలేదు. ఈ మాతృమరణ మహమ్మారికి మందు లేదు." అని పిట్స్‌బర్గ్‌లో పనిచేసే మాతృపిండ ఔషధ నిపుణుడు డాక్టర్ మైక్ అజీజ్ హెచ్చరించారు. అమెరికాలో అకాల ప్రసవాలు కూడా మాతృ మరణాల ప్రధాన కారణాలు. ఎక్కువమంది అమెరికా స్త్రీలకు ప్రాథమిక పూర్వ ప్రసూతి జాగ్రత్తలు అందుబాటులో లేవు. ఈ నేపథ్యంలో గర్భవతులు ఈ పరీక్ష కొరకు రెండువారాల కొకసారి వైద్యునిదగ్గరకు పోలేరని డాక్టర్ అజీజ్ ఆందోళన వ్యక్తపరిచారు. మాతా పిండ శిశుఆరోగ్యాల సూచనల, సలహాలసంస్థ 'మార్చ్ ఆఫ్ డైమ్స్' సమాచారంప్రకారం అమెరికాలో మూడోవంతు కౌంటీలలో కాన్పుల సౌకర్యాలు, జనన కేంద్రాలు లేవు. ప్రభుత్వాల ఈ కొత్త పరీక్ష ప్రచారం అమెరికా మాతృ ఆరోగ్య సమస్యల నుండి ప్రజలదృష్టిని మరల్చడానికే. దీన్ని నమ్మితే బుడ్డను నమ్మి బావిలో దూకినట్లే. రోగులకు ఆరోగ్య భద్రతను, నివారణ జాగ్రత్తలను కల్పించి ఆరోగ్య వ్యవస్థనుమార్చే సంకల్పం ప్రభుత్వాలకు లేదు. పాలకులకు రాజకీయ సుస్థిరతను అందించే కార్పొరేట్ సంస్థలకు ప్రజారోగ్య సువ్యవస్థ లాభాలను అందించదు. డబ్బు చెల్లించలేని నల్లజాతి గర్భిణీలకు మాతా శిశు ప్రసూతి సౌకర్యాలు అందిస్తే వైద్య జాతివాదం పెరుగుతుందని, ఇది కొత్త వైద్య పరీక్షల లాభాలను తగ్గిస్తుందని కార్పొరేట్‌సంస్థల బాధ. తీవ్ర గర్భధారణ సమస్యలున్నా నల్లజాతిగర్భిణీ రోగులను ఆస్పత్రులు, వైద్య కార్యాలయాల నుండి ఇళ్లకు పంపుతారు. వారి ఆరోగ్యం క్షీణించి ఉన్నా నీవు ఆరోగ్యంగా ఉన్నావని నమ్మపలుకుతారు. కొన్నిసార్లు డబ్బులున్నా, సామాజికస్థాయి కలిగినా నల్లతల్లులకు తప్పుడుసలహాలు చెపుతారు. తమనొప్పులను, సమస్యలను నమ్మని శ్వేత సమాజపు నల్ల నిజంతో నల్లజాతి పోరాడుతోంది. సమకాలీన సామాజిక నల్ల వ్యవస్థలో ఆరోగ్య సమస్యల నుండి నల్లజాతిని కాపాడటానికి ఈ కొత్త వైద్య పరీక్షలు చాలవు. ప్రజా ఉద్యమ పరీక్షలు కావాలి. అవి సత్ఫలితాలనివ్వాలి. అత్యాధునిక సామాజిక విప్లవాలు జరగాలి.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

చరవాణి: 9490 20 4545

దద్దరిల్లిన పార్లమెంటు

- మణిపూర్‌పై మోదీ ప్రకటన చేయాల్సిందేనన్న విపక్షాలు
- ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్‌పై సస్పెన్షన్ వేటు
- అధికార, విపక్షాల పరస్పర ఆరోపణలు
- పార్లమెంటు ఉభయసభలు నేటికి వాయిదా

న్యూఢిల్లీ: మణిపూర్ పరిణామాలపై వరుసగా మూడోరోజు సోమవారం కూడా పార్లమెంటు స్తంభించింది. మణిపూర్ దాష్టీకాలపై ప్రధాని సరేంద్రమోదీ ఉభయసభల్లో ప్రకటన చేయాలన్న డిమాండ్‌ను ప్రతిపక్షాలు ముక్తకంఠంతో పునరుద్ఘాటించాయి. మోదీ ప్రకటన చేయకుండా ఉభయసభలను సాగనిచ్చే ప్రసక్తేలేదని తేల్చిచెప్పాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లారు. అదే సమయంలో అధికార ఎన్‌డీఏ సభ్యులు కూడా ఎదురుదాడికి దిగారు. పశ్చిమబెంగాల్, బీహార్‌లలో మహిళలపై దాడుల అంశాన్ని ప్రస్తావించారు. మణిపూర్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లోక్‌సభలో హామీ ఇచ్చినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు శాంతించలేదు. ఉదయం సభ సమావేశం కాగానే ప్రతిపక్షాలు మణిపూర్ అంశాన్ని లేవనెత్తాయి. దీంతో సభ వరుసగా వాయిదా పడుతూ వచ్చింది. మధ్యాహ్నం 2.30 గంటలకు సభ తిరిగి ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సభ్యులను శాంతింపచేసేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు. అంతకుముందు అమిత్‌షా మాట్లాడుతూ చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పినా ప్రతిపక్షాలు ఎందుకు అనుమతించడం లేదో తనకు తెలుసునని వ్యాఖ్యానించారు. గందరగోళం మధ్యనే ప్రభుత్వం మూడు బిల్లులను సభలో ప్రవేశపెట్టింది. ఒక బిల్లును ఉపసంహరించుకుంది. కాగా, సభ సజావుగా సాగడానికి సహకరించాలని, చర్చ జరపాలంటే సభ్యులు తమ తమ స్థానాల్లో కూర్చోవాలని స్పీకర్ స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్ విపక్షాలను కోరారు. అయినా మోదీ ప్రకటన చేయాల్సిందేనని డిమాండ్ చేస్తూ సభ్యులు నిరసన కొనసాగించారు. దీంతో అగర్వాల్ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. సభ సమావేశం కాగానే కాంగ్రెస్, డీఎంకే, వామపక్షాలు, ఇతర ప్రతిపక్ష పార్టీల సభ్యులు లేచినిలబడిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ సభ్యుడు అధిర్ రంజన్ చౌదరిని మాట్లాడటానికి ఓం బిర్లా అనుమతించారు. మణిపూర్ హింసపై ప్రధాని మోదీ సుమోటోగా సభలో ప్రకటన చేయాలని అధిర్ రంజన్ డిమాండ్ చేశారు. మణిపూర్‌పై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ముందుగా ప్రశ్నోత్తరాలు చేపట్టి...12 గంటలకు మణిపూర్‌పై చర్చిద్దామని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. చర్చకు సభ అంతా సిద్ధంగా ఉందని, ప్రభుత్వం కూడా సమాధానం చెబుతుందని స్పీకర్ చెప్పారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి జోక్యం చేసుకుంటూ...చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే, సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించి...సభ నుంచి పారిపోవాలని విపక్షాలు కోరుకుంటున్నాయని ఆరోపించారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ మణిపూర్ హింసపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. ప్రధాని ప్రకటనకే కట్టుబడిన ప్రతిపక్ష పార్టీల సభ్యులు మంత్రుల మాటలను తోసిపుచ్చారు. ప్రతిపక్షాల నినాదాలు, నిరసనల మధ్య సభ 30 నిమిషాలు మాత్రమే కొనసాగింది. 'మణిపూర్‌లో హింసపై ఇండియా చర్చను కోరుకుంటుంది', 'మణిపూర్ కోసం ఇండియా' వంటి నినాదాలతో విపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు. ముందుగా ప్రశ్నోత్తరాలకు సహకరించాలని, తర్వాత మణిపూర్‌పై చర్చకు అందరికీ అవకాశం ఇస్తానని స్పీకర్ చెప్పారు. నినాదాలు, ప్లకార్డులతో సమస్యలు పరిష్కారం కావని నీతులు వల్లించారు.

రాజ్యసభలోనూ ఇదే తీరు...

రాజ్యసభలోనూ ఇదే తీరు కొనసాగింది. ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్‌ను చైర్మన్ ధన్కర్ సభ నుంచి సస్పెండ్ చేశారు. ఉదయం నుంచి వరుసగా వాయిదా పడిన రాజ్యసభ మధ్యాహ్నం 3 గంటలకు సమావేశమై చివరికి మంగళవారానికి వాయిదా పడింది. సస్పెన్షన్‌కు గురైనా ఆప్ ఎంపీ సంజయ్ సభను వదలడానికి ఇష్టపడలేదు. దీంతో చైర్మన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. విపక్ష సభ్యులు మాత్రం మణిపూర్ అంశంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు కొనసాగించారు.

దీంతో మధ్యాహ్నం రెండు గంటలకు సభ సమావేశం కాగానే...చైర్మన్ సస్పెండ్ చేసినందున బయటికి వెళ్లాలని సింగ్‌ను రాజసభ వైస్‌చైర్మన్ హరిశంశ్ ఆదేశించారు. పార్లమెంటు సమావేశాలు మొత్తం హాజరు కాకుండా సింగ్‌పై చైర్మన్ సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో ప్రతిపక్ష సభ్యులంతా నిరసన తెలిపారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. అందుకు డిప్యూటీ చైర్మన్ అనుమతించలేదు.

ఆప్ దేశవ్యాప్త నిరసనలు నేడు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో జరుగుతున్న దాష్టీకాలకు వ్యతిరేకంగా మంగళవారం దేశవ్యాప్త నిరసనలు చేపట్టనున్నట్లు ఆప్ ప్రకటించింది. జంతర్‌మంతర్ వద్ద జరిగే ఆందోళనల్లో పార్టీ అగ్ర నాయకులు పాల్గొంటారని తెలిపింది. మణిపూర్ అంశంపై ఉభయసభల్లో ప్రధాని నరేంద్రమోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులు సోమవారం పార్లమెంటు కాంప్లెక్స్‌లో నిరసనకు దిగారు. మే 3వ తేదీన ప్రారంభమైన హింస, ఉద్రిక్తతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. హత్యలు, అత్యాచారాలు, మహిళలను నగ్నంగా ఊరేగించడం, గృహదహనాలు, దోపిడీలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. రెండు వర్గాల మధ్య ఘర్షణల్లో ఇప్పటికి 160 మందికి పైగా మృతిచెందారు. ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి వీధుల్లో ఊరేగించిన ఘటన బయటికి రావడంతో మణిపూర్‌లో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

మణిపూర్‌పై బస్తర్ డివిజన్ బంద్

జగదల్పూర్: మణిపూర్‌లో మహిళలపై హింసకు వ్యతిరేకంగా చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్‌లో సోమవారం బంద్ జరిగింది. వ్యాపార, వాణిజ్య దుకాణాలు మూసివేశారు. రవాణా నిలిచిపోయింది. మణిపూర్ పరిణామాలపై సర్వ ఆదివాసీ సమాజ్(ఎస్ఏఎస్) బంద్‌కు పిలుపునిచ్చింది. గిరిజన సంఘం ఇచ్చిన బంద్ పిలుపునకు మంచి స్పందన లభించింది. బంద్ ప్రశాంతంగా జరిగిందని, హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదని పోలీసులు తెలిపారు. గిరిజనుల ఆధిపత్యం గల కంకేర్, కొండగావ్, నారాయణపూర్, బస్తర్, బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో బంద్ విజయవంతంగా జరినట్లు ఆ సంఘం తెలిపింది. మణిపూర్‌లో మహిళలపై ఆటవిక దాడికి నిరసనగా జరిగిన బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలిపారని ఎస్ఏఎస్ బస్తర్ డివిజన్ అధ్యక్షుడు ప్రకాశ్ థాకూర్ చెప్పారు. ఎస్ఏఎస్ బస్తర్ డివిజన్ శాఖ బంద్‌కు పిలుపునిచ్చింది. ఇద్దరు గిరిజన మహిళలను ఆటవికంగా నగ్నంగా ఊరేగించడం గిరిజన జాతికే అవమానమని, యావత్ దేశం సిగ్గుతో తలవంచుకోవాలని థాకూర్ మండిపడ్డారు. పాఠశాలలు, నిత్యావసర సేవలు, మందుల షాపులు, అంబులెన్స్‌లకు మినహాయింపు ఇచ్చారు.

మణిపూర్ మహిళల విషాదగాథల్ని తొక్కిపెట్టేందుకు బీజేపీ కుట్ర: థరూర్



న్యూఢిల్లీ: మణిపూర్‌లో మహిళల విషాదగాథలపై చర్చ జరగనీయకుండా బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ పేర్కొన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దాడులను ఉదహరించడం ద్వారా బీజేపీ పాలిత మణిపూర్‌లో జరుగుతున్న దారుణాలపై చర్చ జరగనీయకుండా చేస్తోందన్నారు. పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, బీహార్‌లలో మహిళలపై అఘాయిత్యాల సంఘటనలను బీజేపీ లేవనెత్తుతోందన్నారు. మణిపూర్ పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌పై థరూర్ పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ ... ఈ రోజు దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఏమిటంటే... మన రాష్ట్రం మండిపోతోంది. పొరుగు రాష్ట్రమైన మిజోరంలో ఇప్పటికే అటువంటి పరిణామాలు ఉన్నాయి. ప్రధాని కంటే ఎవరూ దాని గురించి మాట్లాడలేరు. ఆ తర్వాత హోంమంత్రి, ఇతరులు తమ పాత్రను పోషించగలరన్నారు. 'పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు ప్రధానమంత్రి పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడటం సరికాదు, అది ఆమోదయోగ్యం కాదు. ప్రధానమంత్రి పార్లమెంటుకు జవాబుదారీగా ఉంటారు, అది పార్లమెంటరీ ప్రజాస్వామ్య లక్షణం' అని ఆయన అన్నారు. ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల్లో మహిళలపై జరుగుతున్న దాడులను ఉటంకించడం ద్వారా మణిపూర్ భయానక పరిస్థితిని దాచే యత్నం కేంద్రప్రభుత్వం చేస్తోందన్నారు. 'ఇలాంటి అవమానకరమైన సంఘటనలు జరిగినప్పుడల్లా, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాయని, మణిపూర్‌లో మాత్రం అధికారులు నేరస్థులపై చర్య తీసుకోకుండా నిజాన్ని అణిచివేసేందుకు ప్రయత్నిస్తున్నారు' అని శశి థరూర్ పేర్కొన్నారు.

మణిపూర్ అల్లర్లు...
కేసుల దర్యాప్తులో పోలీసులకు కొత్త చిక్కులు

ఇంఫాల్: గత కొన్ని నెలలుగా ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో అల్లర్లతో అట్టుడుకుతోంది. ఈ క్రమంలో మహిళలపై జరిగిన అఘాయిత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దేశ అత్యున్నత న్యాయస్థానమే దీనిని సుమోటోగా తీసుకొని విచారించింది. మరోవైపు ఇప్పటి వరకు మొత్తం ఏడుగురు మహిళలపై లైంగిక దాడి జరినట్లు అక్కడి వర్గాలు చెబుతున్నాయి. వివిధ నేరాలపై ఆ రాష్ట్రంలో నమోదైన జీరో ఎఫ్ఐఆర్‌లు అక్కడి పోలీసులకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. ఇప్పటి వరకు దాదాపు 6000కు పైగా జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు అక్కడి పోలీసు అధికారులు చెబుతున్నారు. వీటిని దర్యాప్తు చేసేందుకు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు పంపాల్సి ఉండగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులతో తీవ్ర జాప్యం ఏర్పడుతోందని అంటున్నారు.

రాష్ట్రంలో జరిగిన అల్లర్లలో దాదాపు 50 వేల మంది నిరాశ్రయులైనట్లు అంచనా. దీంతో తమకు జరిగిన అన్యాయంపై వారంతా వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు. వాటిని పరిశీలించిన అధికారులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేయాల్సి ఉంటుంది. ఇటీవల కుకీ తెగకు చెందిన ముగ్గురు మహిళలను మయితే వర్గానికి చెందిన కొందరు లైంగికంగా వేధించారు. ఈ ఘటన మయితే తెగ ప్రాబల్యం ఎక్కువగా ఉన్న తౌబాల్ జిల్లాలో చోటు చేసుకుంది. దీంతో అక్కడ కేసు నమోదు చేసేందుకు భయపడిన కుకీ తెగకు చెందిన బాధితులు సైకుల్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాదాపు నెల రోజుల తర్వాత కేసును సంబంధిత పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇదే తరహా ఘటన ఇంఫాల్‌లోనూ చోటు చేసుకోగా సైకుల్ పోలీస్‌స్టేషన్‌లోనే ఎఫ్ఐఆర్ నమోదైంది. కేవలం ఈ ఒక్క పోలీస్ స్టేషన్‌లోనే 202 జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు పోలీసులు చెబుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్న పోలీస్‌స్టేషన్లలో ఆయా తెగల ప్రజలు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారు. స్థానికంగా ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. అక్కడ ప్రాబల్యం ఎక్కువగా ఉన్న తెగవారు అడ్డుకోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. దీంతో తమ తెగ ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతం పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నాయి. చురాచంద్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో 1,700 జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాజధాని ఇంఫాల్ పరిసర ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లలోనే అత్యధికంగా జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు సమాచారం. వీటిలో ఎక్కువ ఎఫ్ఐఆర్‌లు మయితే తెగకు చెందిన వారే దాఖలు చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసులపై దర్యాప్తు చేయడం పోలీసులకు ఓ సవాలుగా మారుతోంది.

ఈ రెండు తెగలకు చెందిన వారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను విచారించేందుకు పోలీసులు కూడా వెనకడుగు వేస్తున్నారు. దర్యాప్తు కోసం వారి ఇళ్లకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఒక తెగకు చెందిన పోలీసు అధికారి వేరే తెగ నివసిస్తున్న ప్రాంతానికి వెళ్లాలంటేనే వణుకుతున్నారు. తమ తెగకు చెందిన పోలీసులు వస్తేనే వాళ్లు కూడా అనుమతిస్తున్నారు. లేదంటే దాడికి దిగుతున్నారు. దీంతో ఎఫ్ఐఆర్‌లో పేరు ఉన్న వారిని ఫోన్ ద్వారా సంప్రదించి స్టేషన్‌కు రప్పించి మాట్లాడుతున్నారు. దీంతో దర్యాప్తులో తీవ్ర జాప్యం ఏర్పడుతోందని పోలీసు అధికారులు చెబుతున్నారు. మరోవైపు నెలలు గడుస్తున్నా రాష్ట్రంలోని పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. ఎక్కడో ఒకచోట ధర్నాలు, ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో వారిని అదుపు చేసి, హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా చూసేందుకే సమయం సరిపోతోందని, జీరో ఎఫ్ఐఆర్‌లపై దర్యాప్తు చేసేందుకు సమయం సరిపోవడం లేదని పోలీసులు చెబుతున్నారు.

రుణాల వసూలులో సున్నితంగా వ్యవహరించాలి : నిర్మలా సీతారామన్ సూచన

న్యూఢిల్లీ : రుణాలను వసూలు చేసే క్రమంలో పరుషంగా వ్యవహరించరాదని, ఈ తరహా కేసులను సున్నితంగా, మానవత్వంతో పరిష్కరించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులకు సూచించారు. చిరు వ్యాపారులు, రుణ గ్రహీతల రుణ చెల్లింపు ప్రక్రియకు సంబంధించి లోక్‌సభ ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సోమవారం మంత్రి సీతారామన్ జోక్యం చేసుకుని కొన్ని బ్యాంకులు రుణాల తిరిగి వసూళ్ల విషయంలో పరుషంగా వ్యవహరిస్తున్న తీరు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ విషయంలో బ్యాంకులు మానవత్వంతో సున్నితంగా వ్యవహరించాలని ప్రభుత్వం సూచిస్తోందని తెలిపారు. చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని బ్యాంకులు వసూలు చేయాలనుకుంటే చట్టంలో పొందుపరిచిన విధానం ప్రకారం వసూలు చేయాలని మద్రాస్ హైకోర్టు గతవారం స్పష్టం చేసింది. బ్యాంకులు నియమించిన ప్రైవేట్ ఏజెంట్ల ద్వారా దౌర్జన్యంగా రికవరీ ప్రక్రియ చేపడితే దాన్ని అనుమతించబోమని కోర్టు తేల్చిచెప్పింది. రుణ మొత్తాన్ని రాబట్టేందుకు బ్యాంకులు అంగబలం ప్రదర్శించరాదని పేర్కొంది. రికవరీ ఏజెంట్లపై ఫిర్యాదులు వస్తే ఏజెంట్ల నియామకం చేపట్టకుండా బ్యాంకులపై తాము నిషేధం విధిస్తామని భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) 2008లో జారీ చేసిన సర్క్యులర్‌లో బ్యాంకులను హెచ్చరించింది.

ఆరు చిరుతలకు రేడియో కాలర్ తొలగింపు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో ఆరు చీతాలకు రేడియో కాలర్‌ను తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల వరుసగా చీతాలు మరణిస్తున్న నేపథ్యంలో వైద్య పరీక్షల నిమిత్తం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ప్రాజెక్ట్ చీతాలో భాగంగా నమీబియా, దక్షిణాఫ్రికా నుంచి 20 చీతాలను భారత్‌కు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అనంతరం నాలుగు పిల్లలు జన్మించాయి. మొత్తం 24 చీతాల్లో ఇప్పటివరకు 8 మరణించాయి. సాధారణ కారణాల వల్లే అవి మృతిచెందినట్టు అధికారులు చెపుతున్నారు. రేడియో కాలర్ల వల్లే మృత్యువాతపడ్డట్టు వార్తలు రావడంతో తాజాగా వాటికి రేడియో కాలర్లను తొలగించారు. 'ప్రస్తుతం 11 చీతాలు (ఆరు మగ, ఐదు ఆడ) ఎన్‌క్లోజర్‌లో ఉన్నాయి. ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఇప్పటివరకు ఆరు చీతాలకు రేడియో కాలర్ తొలగించాం. ప్రస్తుతం అవి ఆరోగ్యంగానే ఉన్నాయి' అని అధికారులు తెలిపారు. చీతాల కదలికలను తెలుసుకునేందుకు వాటికి రేడియో కాలర్లను బిగించారు. వాటి కారణంగా చీతాలకు గాయాలయ్యాయి. చీతాలను తిరిగి ఎన్‌క్లోజర్లోకి తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇకపై చీతాల కదలికలను తెలుసుకునేందుకు డ్రోన్లను వినియోగించనున్నారు.

కర్నాటకలో భారీ వర్షాలు

మంగళూరు: దక్షిణ కన్నడ, ఉడిపి జంట జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో గత రెండు రోజులుగా ఈ ప్రాంతంలోని అనేక నదులలో నీటి మట్టం పెరుగుతూ లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. నేత్రావతి, ఫల్గుణిలో నీటి మట్టాలు పెరగడంతో దక్షిణ కర్నాటక జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వాగులు నది ఒడ్డున నివసించే ప్రజలకు ముప్పు కలిగిస్తున్నాయి. బంట్వాల్ తాలూకాలోని కొన్ని కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. పెద్ద విస్తీర్ణంలో పోకచక్కల (ఆర్కనట్) తోటలు కూడా నీటమునిగి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అధికారులు సెలవులు ప్రకటించడంతో సోమవారం దక్షిణ కర్నాటక, ఉడిపి జిల్లాల్లోని వివిధ తాలూకాల్లో పాఠశాలలు మూతపడ్డాయి. కుక్కే సుబ్రహ్మణ్య దేవాలయం స్నాన ఘాట్ నీట మునిగింది. కుమారధార నది నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో వర్షం తగ్గుముఖం పట్టేంత వరకు భక్తులు ఆలయాన్ని సందర్శించవద్దని కోరారు. వరదలతో మంజేశ్వర్-సుబ్రహ్మణ్య రాష్ట్ర రహదారి మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దక్షిణ కర్నాటకలోని అడ్డహోలే, కొల్లమొగ్రు, సుబ్రమణ్య, బిసిలెల్లో కూడా భారీ వర్షాలు కురిశాయి.

ఉడిపి జిల్లాలోని కర్వాలు ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో సమీపంలోని 110 కేవీ కేపీటీసీఎల్ ఓవర్‌హెడ్ లైన్ ఉన్న హైటెన్షన్ విద్యుత్ టవర్‌కు ముప్పు వాటిల్లకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. టవర్ దెబ్బతింటే మణిపాల్, బ్రహ్మావర్, కుంజిబెట్టు, ఉద్యావర్ సహా అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ముందుజాగ్రత్త చర్యగా మణిపాల్-హిరియడ్క పాత లైన్‌ను యాక్టివేట్ చేశామని, ఆదివారం నుంచే ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. మరోవైపు కోస్తా కర్నాటకలో జూలై 27 వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

జ్ఞానవాపి మసీదులో నిలిచిన సర్వే

జులై 26 వరకు 'స్టే' విధించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని వివాదాస్పద జ్ఞానవాపి మసీదు వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ మసీదులో వారణాసి కోర్టు ఆదేశాల మేరకు సోమవారం నుంచి ప్రారంభమైన పురావస్తు శాఖ సర్వేను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో కాశీ విశ్వనాథుని ఆలయం, జ్ఞానవాపి మసీదు పక్కపక్కనే ఆనుకుని ఉంటాయి. గతంలో హిందూ ఆలయం ఉన్న ప్రాంతంలో మొఘల్ చక్రవర్తుల కాలంలో జ్ఞానవాపి మసీదు నిర్మించారనేది వివాదం. అందుకే పురావస్తు శాఖతో కార్బన్ డేటింగ్ పరీక్షలు నిర్వహించాలని కోరుతూ హిందూ వర్గాలు చేసిన వాదనకు అనుగుణంగా వారణాసి కోర్టు సర్వేకు ఆదేశించింది. ఈ సర్వే సోమవారం ప్రారంభమైంది. కోర్టు ఆదేశాల మేరకు ఉదయం సర్వే ఉంటుందని వారణాసి కలెక్టర్ స్పష్టం చేశారు. 40 మంది పురావస్తు అధికారులు, పోలీసులు లోపలకు ప్రవేశించారు. అయితే సుప్రీంకోర్టు గత ఆదేశాల మేరకు సీజ్ చేసిన వజూఖానా ప్రాంతాన్ని మినహాయించి మిగిలిన ప్రాంతంలో సర్వే ప్రారంభించారు. ఈలోగా వారణాసి కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా మసీదు మేనేజ్‌మెంట్ కమిటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై అత్యవసర విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం... సర్వే సమయంలో మసీదు ప్రాంగణంలో పురావస్తు అధికారులు తవ్వకాలు చేపడతారా? అని కేంద్రాన్ని సుప్రీం ప్రశ్నించింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ... "ఒక్క ఇటుకనూ తొలగించట్లేదు. అలాంటి ప్రణాళిక కూడా లేదు. ప్రస్తుతానికి కేవలం కొలతలు, ఫొటోగ్రఫీ, రాడార్ ప్రక్రియ మాత్రమే కొనసాగుతోంది. ఇది మసీదు నిర్మాణాలపై ఎలాంటి ప్రభావం చూపించదు" అని కోర్టుకు తెలిపారు. మసీదు ప్రాంగణంలో నిర్మాణాల తొలగింపు లేదా తవ్వకాలు చేపట్టట్లేదని వివరించారు. అయితే ప్రతివాదుల వాదన వినేంతవరకూ సర్వేపై స్టే విధిస్తూ చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదేశాలు జారీ చేశారు. జులై 26 వతేదీ సాయంత్రం 5 గంటల వరకూ సర్వే ఆపేయాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదేశించారు. వారణాసి కోర్టు ఆదేశాలపై హైకోర్టును ఆశ్రయించాలని కూడా మసీదు కమిటీకు సుప్రీంకోర్టు సూచించింది. మసీదులోని వజూఖానాలో బయటపడిన ఆకారం శివలింగమని హిందూవులు, కాదు నీటి కొలను నిర్మాణమని మసీదు కమిటీ వాదించుకుంటున్నాయి. జ్ఞానవాపి మసీదు సైతం కాశీ విశ్వనాథ ఆలయంలో భాగమని, మసీదు గోడలపై హిందూ దేవతా మూర్తుల విగ్రహాలున్నాయనేది హిందూ సంఘాల వాదన. క్రీస్తుశకం 1500 సంవత్సరం నుంచి అక్కడ మసీదు ఉన్నప్పుడు ఈ విషయంలో అంత తొందరెందుకని, దీనిపై స్టేటస్ కో ఉండాలని జ్ఞానవాపి మసీదు కమిటీ సుప్రీంకోర్టులో వాదించింది. దీనిపై జులై 26న విచారణ జరిగే వరకూ స్టేటస్ కో విధిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలివ్వడంతో సర్వే నిలిచిపోయింది.

లోక్‌సభలో నేషనల్ డెంటల్ కమిషన్ బిల్లు

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రభుత్వం నేషనల్ డెంటల్ కమిషన్ (ఎన్‌డీసీ) బిల్లు-2023ను ప్రవేశపెట్టింది. డెంటిస్ట్స్ యాక్ట్-1948ను రద్దుచేసి దాని స్థానంలో నేషనల్ డెంటల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నది ఈ బిల్లు ఉద్దేశం. బిల్లు ఆమోదం పొందితే ప్రస్తుతం డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న పాత్రనే ఎన్‌డీసీ నిర్వహించనుంది. రెండున్నరేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ)ని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)గా మార్పు చేసింది. అదే విధానంలో ఇప్పుడు డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎన్‌డీసీ) ఎన్‌డీసీగా మార్చాలని భావిస్తున్నది.

దంత వైద్య విద్యను సరసమైనదిగా చేయడం, నాణ్యమైన నోటి ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడం కూడా ఈ బిల్లు లక్ష్యం.

వాట్సాప్ స్టేటసూ కమ్యూనికేషన్ వ్యవస్థే
బాంబే హైకోర్టు

ముంబై: 'వాట్సాప్ స్టేటస్' అంశంలో బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇదీ ఒక రకమైన సమాచార వ్యాప్తి వ్యవస్థేనని.. దీని ద్వారా సమాచారం వ్యాప్తి అవుతుందని పేర్కొంది. ఇతరులతో సంభాషించే సమయంలో ఆ వినియోగదారు బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. ద్వేషపూరిత సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాడనే అభియోగాలతో ఒక వ్యక్తిపై నమోదైన కేసులో ఈ విధమైన వ్యాఖ్యలు చేసింది. తనపై నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన బాంబే హైకోర్టులోని నాగ్‌పూర్ బెంచ్ పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. మహారాష్ట్రకు చెందిన కిశోర్ లాండ్కర్ అనే వ్యక్తి తన వాట్సాప్ స్టేటస్‌లో ఒక ప్రశ్న వేస్తూ సమాధానాన్ని గూగుల్‌లో వెతకాలని పెట్టాడు. అందులో ఊహించని నిజాలు తెలుస్తాయని పేర్కొన్నాడు. ఆయన చెప్పిన విధంగానే గూగుల్‌లో వెతికిన ఒక వ్యక్తికి అభ్యంతరకర వీడియోలు కనిపించాయి. అవి కొన్ని వర్గాల ప్రజల మనోభావాలు దెబ్బతీసేవిగా ఉన్నాయని ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కిశోర్‌పై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ ఏడాది మార్చిలో ఈ వ్యవహారం చోటుచేసుకుంది. అయితే, తనపై నమోదు చేసిన కేసులను కొట్టివేయాలని కోరుతూ కిశోర్ అక్కడి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై నాగ్‌పూర్ బెంచ్ ధర్మాసనం విచారణ జరిపింది.

సాగు భూముల పట్టాల కోసం ఐక్య పోరాటాలు

కష్టజీవుల పెన్నిధి బీకేఎంయూ

జల్లి విల్సన్, ఆవుల శేఖర్

విశాలాంధ్ర-ఉండి: పేదలకు సాగు భూముల పట్టాల కోసం ఐక్య పోరాటాలు అవశ్యమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. కష్టజీవుల జీవన ప్రమాణాలు పెంచేందుకు సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం అనేక పోరాటాలు చేశాయని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా 25వ మహాసభ ఉండిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సోమవారం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సనపల శ్రీను, ఉల్లింకల జయకృష్ణ, సీహెచ్ సరోజిని అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ అనేక పోరాటాల ద్వారా భూస్వాముల చేతిలో చిక్కుకున్న లక్షలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేసిన ఘనత బీకేఎంయూ, సీపీఐదేనన్నారు. అటవీ, బంజర, రెవెన్యూ, సముద్ర తీర భూములను పేదలకు పంపిణీ కోసం సాగించిన అనేక పోరాటాల ఫలితంగా నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కోనేరు రంగారావు అధ్వర్యంలో కమిటీ వేశారని గుర్తుచేశారు. పేదవాడి చేతిలో భూమి ఉంటేనే ఆహార ఉత్పత్తి పెరుగుతుందని, దీనిద్వారా వ్యవసాయ కూలీల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని కమిటీ సిఫార్సు చేసిందని చెప్పారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను స్వాగతిస్తున్నామని, అదే సమయంలో సంక్షేమ పథకాల ముసుగులో ఇళ్ల స్థలాల కోసం దళితులు అనాదిగా సాగు చేసుకుంటున్న భూములను దౌర్జన్యంగా లాక్కోవడాన్ని జల్లి విల్సన్ తప్పుబట్టారు. పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. భీమవరం, ఉండి, కాళ్ళ మండలాలలో వేలాది ఎకరాల భూములను పేదలకు పంచి పెట్టడం కోసం అద్వితీయ పోరాటాలు చేసిన చరిత్ర ఉందన్నారు. మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై వ్యవసాయ కార్మికులు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 24, 25, 26 తేదీలలో బాపట్లలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభకు జిల్లా నుండి పెద్ద ఎత్తున వ్యవసాయ కూలీలు తరలివచ్చి...జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం పోరాట ఫలితంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టంగా రూపుదాల్చిందన్నారు. ఉపాధి హామీ అమలు జరిగిన తర్వాత వ్యవసాయ కూలీల జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి 200 పని దినాలు కల్పించి రోజుకి రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో మెరుగైన వసతులు కల్పించాలని, రెండు పూటలా ఫొటోలు తీసే విధానాన్ని ఉపసంహరించాలన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మణిపూర్ ఘటన సభ్య సమాజానికి సిగ్గుచేటన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రోత్సాహంతోనే మారణకాండ కొనసాగుతోందని ఆరోపించారు. సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల కూలి పెరుగుదల, సాగు భూములకు పట్టాల కోసం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వంక సత్యనారాయణ, నాగిడి సాంబమూర్తి, కొండ్రు సుబ్బారావుతోపాటు అనేకమంది పోరాటాలు చేశారని గుర్తుచేశారు. పేదల చేతుల్లో భూములు ఉంటే ఆర్థికంగా బలపడి జీవితాలు మెరుగుపడతాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 86 సంవత్సరాలుగా అనేక భూ పోరాటాలు చేసి లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిన చరిత్ర మన సంఘానిదేనన్నారు. రెవెన్యూ పోరంబోకు, అటవీ బంజరు భూములు, వన సంరక్షణ సమితులు పంపిణీ చేయడంలో చేసిన కృషి అద్వితీయమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, బీకేఎంయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలిశెట్టి వెంకట్రావు తదితరులు ప్రసంగించారు. గంజి రాజు, కోన గొల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలవరం తొలిదశకు రూ.12,911 కోట్లు

కేబినెట్ ఆమోదం తర్వాత నిధుల విడుదల

రాజ్యసభలో జలశక్తి మంత్రి బిశ్వేశ్వర్ తుడు వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ తొలిదశలో మిగిలిన పనులు పూర్తి చేయడానికి రూ.12,911 కోట్లను విడుదల చేయడానికి ఆర్థిక మంత్రిత్వ శాఖలోని వ్యయ విభాగం ఆమోదం తెలిపినట్లు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు వెల్లడించారు. రాజ్యసభలో సోమవారం వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. పోలవరం ప్రాజెక్ట్ తొలిదశ కింద చేపట్టిన నిర్మాణాల్లో మిగిలిన పనులు పూర్తి చేసి 41.15 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిలువ చేసేందుకు 10 వేల 911.15 కోట్ల రూపాయలు, వరదల కారణంగా దెబ్బతిన్న నిర్మాణాల మరమ్మతుల కోసం మరో 2 వేల కోట్ల రూపాయలు విడుదల చేయడానికి తమకు అభ్యంతరం లేదని ఆర్థిక మంత్రిత్వ శాఖలోని వ్యయ విభాగం గత నెల జూన్ 5వ తేదీ తెలిపిందని పేర్కొన్నారు. పోలవరం నిధులకు సంబంధించి గతంలో తీసుకున్న నిర్ణయాన్ని సవరిస్తూ కేంద్ర మంత్రివర్గం తాజా ప్రతిపాదనలను ఆమోదించాల్సి ఉందని మంత్రి వివరించారు. పోలవరం తొలిదశ నిర్మాణంలో మిగిలిన పనులు పూర్తి చేయడానికి సవరించిన అంచనాల ప్రకారం రూ.17,144 కోట్ల అవసరం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత జూన్ 5న తమకు ప్రతిపాదనలు సమర్పించిందని మంత్రి తెలిపారు. వీటిని త్వరితగతిన పరిశీలించి ప్రభుత్వ ఆమోదం పొందేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు.

అయితే ఈ ప్రక్రియ నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తి చేయాలని కోరడం సబబు కాదని అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ సవరించిన అంచనా వ్యయానికి సంబంధించి మార్చి 15, 2022న రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనల ప్రాతిపదికన తక్షణం రూ.10 వేల కోట్లను విడుదల చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జులై 15, 2022న రాసిన లేఖను కూడా ఆర్థిక శాఖ వ్యయ విభాగం పరిగణలోకి తీసుకున్న పిమ్మటే మొత్తం 12,911 కోట్ల రూపాయల నిధుల విడుదలకు ఆమోదం తెలిపిందని మంత్రి వివరించారు.

వైసీపీ పాలనలో 'వృక్ష విలాపం'

జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనల సందర్భంలో చెట్లు నరికి వేస్తున్న తీరుపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురంలో ఈనెల 26న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సీఎం హెలికాప్టర్ దిగేందుకు ఓల్డ్ పోలీస్ క్వార్టర్స్ వద్ద ఖాళీ స్థలంలో కొబ్బరి చెట్లను నరికి హెలిప్యాడ్ సిద్ధం చేస్తున్నారు. దీనిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. వైసీపీ పాలనలో చెట్లు కూడా విలపిస్తున్నాయని సెటైర్ వేశారు. కొట్టేసిన చెట్ల దృశ్యాలతో ఆయన ట్వీట్లు చేశారు. వైసీపీ పాలనలో వృక్షాలు కూడా విలపిస్తున్నాయంటూ సోమవారం ఆయన ట్వీట్ చేశారు. "మనకు నీడను అందించడమే కాకుండా ఆహారాన్ని కూడా అందించే చెట్లను మీరు రక్షించనప్పుడు, చివరికి ఆ కర్మ కేవలం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రినే కాదు ఈ పరిపాలనలో భాగమైన అందరినీ పట్టుకుంటుంది. ఏపీ సీఎం పర్యటనలో చెట్లను నరికివేయడం అనేది ఒక విచిత్రమైన తీరుగా కనిపిస్తోంది. జంధ్యాల పాపయ్య శాస్త్రి 'పుష్ప విలాపం' చదవనప్పుడు... ప్రఖ్యాత శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్ ప్రయోగాలు అర్థం కానప్పుడు- వృక్షాలను, మొక్కలను నరికేస్తుంటే కలిగే బాధ వీటిని చూస్తే మీకు తెలుస్తుంది. సీఎం పట్టించుకోకపోయినా ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అయినా విచక్షణారహితంగా చెట్లను నరికివేయవద్దని సంబంధిత అధికారులకు సూచించాలి' అని పవన్ ట్వీట్ చేశారు. 'కోనసీమలో కొబ్బరి చెట్టును ఇంటికి పెద్ద కొడుకుగా భావిస్తారు. అటువంటి కొబ్బరి చెట్లను సైతం నిలువునా నరికేశారు. తమిళనాట చెట్టును కుటుంబ సభ్యునిగా చూసుకుంటారు. ఈ రాష్ట్రంలో ఆస్తులు కూడబెట్టుకొనే వాళ్లు ఈ విషయం కూడా తెలుసుకోవాలి. వృక్షో రక్షతి రక్షితః' అని పవన్ ట్వీట్ చేశారు. ఇలా చెట్లను నరకవద్దని ఏపీ సీఎస్ అయినా అధికారులకు చెప్పాలని కోరారు.

26న 'మారుతున్న రాజకీయ పరిస్థితులు-మీడియా పాత్ర' అంశంపై మద్దుకూరి స్మారకోపన్యాసం

విశాలాంధ్ర-విజయవాడ:

విశాలాంధ్ర వ్యవస్థాపక సంపాదకులు, ఆంధ్ర కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరు, స్వాతంత్ర్య సమరయోధులు మద్దుకూరి చంద్రశేఖరరావు 49వ వర్థంతి సభ ఈ నెల 26 బుధవారం సాయంత్రం చుట్టుగుంట వద్ద ఉన్న చంద్రం బిల్డింగ్‌లో జరగనుంది. ఈ సందర్భంగా ' మారుతున్న రాజకీయ పరిస్థితులు-మీడియా పాత్ర' అనే అంశంపై సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్మారకోపన్యాసం చేస్తారు. విశాలాంధ్ర సంపాదకులు ఆర్.వి.రామారావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కోశాధికారి జి.ఓబులేసు, జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి పాల్గొంటారు.

హైదరాబాద్‌లో ధోనీ భార్య సాక్షిసింగ్ సందడి

హైదరాబాద్: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని సినిమాల నిర్మాణానికి శ్రీకారం చుడుతూ సొంత బ్యానర్ ను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ బ్యానర్ పై నిర్మితమయ్యే సినిమాల వ్యవహా రాలను ఆయన శ్రీమతి సాక్షి సింగ్ ధోని చూసు కుంటుంది. అలా తమిళంలో నిర్మితమైన సినిమానే 'ఎల్‌జీఎం'. ఈ సినిమాను తెలుగులోను ఈ నెల 28వ తేదీన విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ లో సాక్షి సింగ్ ధోని బిజీగా ఉన్నారు. తెలుగు వెర్షన్ కి సంబంధించిన ప్రమోషన్ కోసం, హీరో హరీశ్ కల్యాణ్ .. హీరోయిన్ ఇవానా .. నది యాతో, ఇతర బృందంతో కలిసి ఆమె హైదరాబాద్ వచ్చారు. అందుకు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలు సందడి చేస్తున్నాయి. ఫ్యామిలీ ఎంటర్టైనర్ జోనర్లో ఈ సినిమా రూపొందింది. రమేశ్ తమిళమణి దర్శకత్వం వహించిన ఈ సినిమా నుంచి ట్రైలర్ ను వదిలారు. ఒక అమ్మాయి ఒక ఇంటికి కోడలిగా వెళ్లడానికి ముందు, ఆ అత్తతో పొంతన కుదురుతుందో లేదో తెలుసుకోవడం కోసం ఒక ట్రిప్ ను ప్లాన్ చేయడమే ఈ సినిమా కాన్సెప్ట్. ఈ సరదా కాన్సెప్ట్ ఆడియన్స్‌కి నచ్చింది. ఇక సినిమా ఎలా ఉంటుందనేది చూడాలి.

మణిపూర్ హింస వెనుక కుట్ర

- గోడు చెప్పుకునేందుకు మోదీ సమయమే ఇవ్వలేదు
- బీజేపీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో చెలరేగుతున్న హింస కేవలం శాంతిభద్రతల సమస్య కాదని, దీని వెనుక భారీ కుట్ర ఉన్నదని ఆ రాష్ట్ర అధికార పార్టీ బీజేపీ ఎమ్మెల్యే పోలిన్‌లాల్ హోకిప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మహిళల నగ్న వీడియో బయటకు రాకుంటే ప్రధానమంత్రి మోదీ అసలు మాట్లాడేవారే కాదన్నారు. హింస మొదలైనప్పుడే సమస్యను చెప్పుకునేం దుకు ప్రధాని అపాయింట్‌మెంట్ అడిగామని, ఇప్పటికీ కలిసేందుకు ఆయన అంగీకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హింసకు మయితే మిలీషియాతోపాటు పోలీసులూ కారణమని విమర్శించారు. మణిపూర్‌లో ఏం జరుగుతున్నదో ప్రధానికిగానీ, కేంద్ర హోంమంత్రికి గానీ తెలియదని ఒక మీడియా సంస్థకు ఆయన తెలిపారు. కుకీలపై మయితే మిలీషియా గ్యాంగులతోపాటు పోలీసులు కూడా దాడులు చేస్తున్నారని హోకిప్ వెల్లడించారు. మయితే మిలీషియా, పోలీసులు కలిసే తిరుగుతున్నారని, ఉమ్మడిగానే మారణ కాండకు పాల్పడుతున్నారని చెప్పారు. 'మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియో బయటకు రాకుంటే ప్రధాని మణిపూర్ హింసపై అసలు మాట్లాడేవారే కాదు. సీఎం బీరేన్‌సింగ్ ఆ పదవికి అర్హుడు కాదు. ఇది మానవ హక్కుల సమస్య. తీవ్రమైన రాజకీయ సంక్షోభమిది. ఇందులో సైన్యం కూడా ప్రేక్షక పాత్రే పోషిస్తున్నది. మాకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం పోయింది. కుకీలకు ప్రత్యేక పరిపాలన వ్యవస్థను ఏర్పాటు చేయటమే ఈ సమస్యకు పరిష్కారం. ప్రజలు ఎన్నుకున్న నాలాంటి ఎమ్మెల్యేల ప్రాణాలకే ఇక్కడ హామీలేదు. అసెంబ్లీకి వెళ్లటానికే నాకు భయంగా ఉన్నది' అని కుకీ వర్గానికి చెందిన ఈ బీజేపీ ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

మణిపూర్ దుస్థితిపై గిరిజన రచయితల లేఖ

న్యూఢిల్లీ: మణిపూర్‌లో శాంతిని నెలకొల్ప డంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ గిరిజన రచయితలు సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి లేఖ రాశారు. 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 86 మంది గిరిజన రచయితలు ఈ లేఖపై సంతకాలు చేశారు. "సువిశాలమైన, సాంస్కృతిక వైవిధ్యం కలిగిన దేశానికి రాజ్యాంగ అధిపతి అయిన రాష్ట్రపతి రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు సహాయం చేయాలి" అని దేశంలోని కోట్లాది మంది గిరిజ నుల తరపున ఆల్ ఇండియా ఫస్ట్ నేషన్స్ (స్వదేశీ, ఆదివాసీ) రచయితల సదస్సు సభ్యులు ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

గత రెండు నెలలుగా మణిపూర్‌లో కొనసాగు తున్న హింసాకాండ పట్ల దేశవ్యాప్తంగా ప్రజలు, తాము దిగ్భ్రాంతి చెందామనీ, విచారం వ్యక్తం చేస్తున్నామని గిరిజన రచయితలు ఆ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న దుస్థితికి సంబంధించి మే 4 నాటి వీడియో ఒకటి గత వారం విడుదలైంది. ఇద్దరు కుకీ గిరిజన మహిళలను బందీలుగా చేసి, క్రూరంగా హింసించారు. ఇది భారత దేశంలోని 700కు పైగా గిరిజన సంఘాలను మాత్రమే కాకుండా మొత్తం పౌర సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. దేశంలోని ఆదివాసీ సాహితీవేత్తల మైన తాము ఈ హీనమైన, అమానుష చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గిరిజన మహిళలపై క్రూరమైన దాడికి పాల్పడిన ప్రత్యక్ష, పరోక్ష నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళలపై క్రూరత్వం కేవలం నేరం మాత్రమే కాదు, అమానుషమైన చర్యగా పేర్కొ న్నారు. మతపరమైన అల్లర్లు, యుద్ధాలతో నిండిన చరిత్ర కలిగిన సమాజం ఇటువంటి దాడులను ప్రేరేపిస్తోందని, పైగా వారు తమను తాము గిరిజనుల కన్నా నాగరికత తెలిసిన వారమని, సంస్కారవంతులుగా భావించుకుంటారని పేర్కొ న్నారు. అత్యున్నత నేత, భారత కొత్త రాజ్యాంగంపై చర్చ జరిపిన రాజ్యాంగ సభ్యులు జైపాల్ సింగ్ ముండా ప్రజాస్వామ్య దేశంలో గిరిజనులు సమానత్వం, శాంతితో జీవించే హక్కును పొందాలని సూచించారని అన్నారు. ఎందుకంటే గిరిజనులు దేశ సృష్టికర్తలు, మూల నివాసులు అని లేఖలో గుర్తు చేశారు. ప్రపంచం లోని పురాతన రిపబ్లికన్ వ్యవస్థకు ఆదివాసీ ప్రజలే నిర్మాతలు. వాహకాలు. కానీ భారతదేశంలోని ఆదివాసీలమైన తాము కొత్త భారత రాజ్యాంగాన్ని అంగీకరిస్తున్నామని ఎందుకంటే అది ప్రజా స్వామ్యాన్ని అనుసరిస్తుందని పేర్కొన్నారు. అయితే గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనుల ప్రయోజనాలను పరిరక్షిం చేందుకు రాజ్యాంగంలో పొందుపరిచిన ఐదవ, ఆరవ షెడ్యూళ్లలోని నిబంధనలను నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని తెలిపారు. తమ హక్కులను కాపాడుకోవాలనుకునే గిరిజనులపై, ప్రభుత్వానికి చేరవేయాలనుకునే వారిపై క్రూరమైన, అమానుషమైన దాడులకు దిగుతున్నారని తెలిపారు. ఇటువంటి క్రూరమైన, అమానవీయమైన ఘటనలు ఏ పౌర సమాజానికైనా అవమానకరమని, భారత ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి వ్యతిరేకంగా జరిగిన అత్యంత హేయమైన నేరాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

'నెలసరి శుభ్రత'పై

రాష్ట్రాలకు సుప్రీం హెచ్చరిక

న్యూఢిల్లీ: పాఠశాలల్లో చదువుతున్న బాలికల రుతుక్రమ పరిశుభ్రతపై జాతీయ విధానాన్ని రూపొందించడంలో రాష్ట్రాలు అలసత్వం ప్రదర్శించడంపై దేశ అత్యున్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది. ఆగస్టు 31లోగా ఈ అంశంపై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ స్పందనలను కేంద్రానికి సమర్పించాలని ఆదేశించింది. లేదంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని 6-12 తరగతుల బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్‌లు అందించాలని, పాఠశాలల్లో ప్రత్యేక మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గతంలో విచారణ చేపట్టింది. పాఠశాలల్లో చదివే బాలికలు రుతుక్రమ పరిశుభ్రతను పాటించేలా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఒక జాతీయ విధానాన్ని అవలంబించాలని సూచించింది. ఈ విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్రాల నుంచి అభిప్రాయాలు, సలహాలు-సూచనలను సేకరించాలని ఈ ఏడాది ఏప్రిల్ 10న సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది.

ఈ పిటిషన్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. "రుతుక్రమ పరిశుభ్రతపై జాతీయ విధానాన్ని రూపొందించేందుకు సుప్రీంకోర్టు గతంలో మార్గదర్శకాలు జారీ చేసింది. దీనిపై రాష్ట్రాలు నాలుగు వారాల్లోగా తమ స్పందనలను కేంద్రానికి ఇవ్వాలని ఆదేశించింది. ఇప్పటివరకు కేవలం హరియాణా, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ మాత్రమే తమ అభిప్రాయాలను సమర్పించాయి" అని భాటి కోర్టుకు వివరించారు. మిగతా రాష్ట్రాలు కూడా తమ స్పందనలు తెలిపేందుకు మరో చివరి అవకాశం ఇవ్వాలని కోరారు. ఇందుకు ధర్మాసనం స్పందిస్తూ.. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఆగస్టు 31లోగా తమ అభిప్రాయాలను కేంద్రానికి సమర్పించాలని ఆదేశించింది. లేదంటే ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ ఉత్తర్వుల ప్రతిని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు పంపించాలని సూచించింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను నవంబరు రెండో వారానికి వాయిదా వేసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.